

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

31.07.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 79
పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


హిందుత్వం అంటే మతం కాదు

## జీవన విధానం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే..
- దేశం వెనకబడు తుందని కామెంట్



2లో..

## వంద రోజుల్లో రూ. 6వేల కోట్లు క్లియర్

- మూడో విడతగా మరో రూ. 2,000 కోట్లు విడుదల
- జేఏసీకి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం
- కమ్యూటేషన్ బకాయిలన్నీ పూర్తిగా చెల్లింపు
- రేవంత్, భట్టి ఆదేశాలతో నిధుల విడుదల

2లో..



**హైదరాబాద్, జులై 30, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన మాట ప్రకారం, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 100 రోజుల్లో మొత్తం రూ. 6,000 కోట్ల బకాయిలను పూర్తిగా విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి గురువారం మరో రూ. 2,000 కోట్లను విడుదల చేశారు.

సమయపాలనతో

## ప్రయాణం

కరీంనగర్‌లో 'సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్' ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

2లో..



**కరీంనగర్, జులై 30, అనంతజనశక్తి న్యూస్**

కరీంనగర్ నగరవాసులకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కరీంనగర్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 'సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్' బస్సులను జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.

# ఆ కసితోనే జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం

## మంత్రి నారా లోకేశ్ కామెంట్

- రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారు
- రాష్ట్ర విభజన సమయంలో ఇదే జరిగింది
- యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి
- ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయి

**అమరావతి, జులై 30, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్ర విభజన సమయంలో రాజధాని ఎక్కడో చెప్పకుండా మనల్ని గెంటేశారని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ కసితోనే రాష్ట్రంలో అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం కర్నూలులో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయని అంటే అందులో ఆ శాఖ మంత్రి టీజీ భరత్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ఓ పట్టుదలతో తామంతా పనిచేస్తున్నామని అన్నారు. రిలయన్స్, ఫార్మాతోపాటు ఇతర పరిశ్రమలు కర్నూలు జిల్లాకు వస్తున్నాయని ఆయన వివరించారు.



పట్టుదలతోపాటు క్రమశిక్షణతో పనిచేయాలని ఈ సందర్భంగా యువతకు మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ మూడు నెలల్లో (90 రోజుల్లో) వస్తుందని ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గతంలో తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తనను పత్తికొండలో పోలీసుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేశారని.. కానీ ప్రజలు, కార్యకర్తలు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.

యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని భారీగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టులు వస్తుంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనిట్‌పై రూ.13 పైసలు తగ్గించామన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ■

## సమస్యలను తక్షణమే గుర్తించి.. పరిష్కరించాలని ఆదేశం

### అంగన్‌వాడీ ఉద్యోగాల నియామకం

### పలు జిల్లాలకు మంత్రి సీతక్క డెడ్‌లైన్



2లో..

**హైదరాబాద్, జులై 30, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అలాంటి అధికారిక

## కేటగిరీ లేదు

- సూపర్ ఎల్‌నినోపై రాజ్యసభలో
- కేంద్రం కీలక ప్రకటన
- తీవ్రతను ఐఎండీ అంచనా వేస్తుందని వివరణ

2లో..



## సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం కావాలి

- సాగునీటి సంక్షోభంపై పవన్ సమీక్ష
- ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశాలు
- రైతులకు అవగాహన కల్పించాలన్న పవన్

2లో..



**అమరావతి, జులై 30, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో సూపర్ ఎల్ నినో ప్రభావం, సాగునీటి పరిస్థితులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సాగునీటి పరిస్థితులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను పవన్ కు వివరించారు. రైతులు ఆందోళన చెందకుండా వాస్తవ పరిస్థితులను తెలియజేయడంతో పాటు సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు.

## అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు?

విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తే..
రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే
విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారు

2లో..



వారం రోజుల పోలీసు

## కస్టడీకి నాగరాజు!

- గాదె సాయికృష్ణ కేసులో సిట్ దూకుడు
- గాదె సాయికృష్ణ లాకప్ డెత్ వ్యవహారం
- రాజమండ్రి జైలు నుంచి పోలీసు కస్టడీకి

2లో..



## ప్రమాదాన్ని కుట్రగా మార్చారు!

- సీదిరి అప్పలరాజు కుటుంబంపై కక్ష సాధింపు
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సాధారణ రోడ్డు ప్రమాదాన్ని కుట్ర, హత్య కేసుగా

### వైఎస్ కుటుంబంలో తీవ్ర విషాదం

**అమరావతి, జులై 30, అనంత జనశక్తి న్యూస్**

వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్

### జగన్ పెద్దనాన్న మృతి ఈ ఏడాదిలోనే ఇద్దరు

రెడ్డి కుటుంబంలో వరుస విషాదాలు నెలకొంటున్నాయి. కొన్ని రోజుల క్రితమే అనారోగ్యంతో వైఎస్ జగన్ సోదరుడు కన్నుమూశారు.

11లో..





# హిందుత్వం అంటే మతం కాదు
# జీవన విధానం

**అమరావతి, జులై 30, అనంత జనశక్తి న్యూస్**

హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాట మంతిలో పాల్గొని వెంకయ్యనాయుడు ప్రసంగించారు.

**వందేమాతరం గీతం మనందరికీ సమాధానం..**

మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తిమంతమైన భారత్ కావాలంటే యువతీ, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# వంద రోజుల్లో
# రూ. 6వేల కోట్లు క్లియర్



**(మొదటిపేజీ తరువాయి)**

ఈ బకాయిల చెల్లింపు ప్రక్రియను ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేసింది. మొదటి విడతగా గత మే 29న రూ. 2,000కోట్లు, రెండో విడతగా జూన్ 30న రూ. 2,000కోట్లు విడుదల చేయగా, తాజాగా మూడో విడతగా మరో రూ. 2,000 కోట్లను విడుదల చేసి ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది.

ఈ నిధుల విడుదలతో విశ్రాంత ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నీ పూర్తిగా చెల్లించబడ్డాయి. పదవీ విరమణ పొందిన సిబ్బంది సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మిగిలిన ఇతర బకాయిలను కూడా రాబోయే రోజుల్లో ఇదే రీతిలో క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి బకాయిలు చెల్లించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, విశ్రాంత సిబ్బంది తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ఉద్యోగ జేఏసీ నేతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సమస్యలను తక్షణమే గుర్తించి..
# పరిష్కరించాలని ఆదేశం



**(మొదటిపేజీ తరువాయి)**

అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశించారు.

# సమయపాలనతో ప్రయాణం

**(మొదటిపేజీ తరువాయి)**

పెరుగుతున్న నగర జనాభా, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక రవాణాను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదటి దశలో భాగంగా ఆర్టీసీ కరీంనగర్ 2 డిపో పరిధిలో మూడు బస్సులతో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఇవి ప్రధానంగా వాగేశ్వరి కాలేజీ, చింతకుంట, కొత్తపల్లి హవేలీ రూట్లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. నగరం స్మార్ట్ సిటీగా మారుతున్న తరుణంలో.. వివిధ ప్రాంతాలలోని విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలకు తక్కువ ఖర్చుతో కూడిన సురక్షితమైన, సమయపాలనతో కూడిన ప్రయాణాన్ని అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం.

కరీంనగర్‌లోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన వ్యాపార కేంద్రాలను అనుసంధానిస్తూ ఈ రూట్లను రూపొందించారు. దీనివల్ల ప్రజలు ప్రైవేటు వాహనాలపై ఆధారపడటం తగ్గి, రవాణా ఖర్చులు గణనీయంగా ఆదా అవుతాయి. అంతేకాకుండా నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడి , కాలుష్యం కొంతమేరకు తగ్గే అవకాశం ఉంది. మహిళలు, విద్యార్థినులకు ఈ బస్సులు సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తాయి.

ప్రస్తుతం పరిమిత సంఖ్యలో మూడు మార్గాల్లోనే ఈ బస్సులు నడుస్తున్నప్పటికీ, ప్రజల నుండి వచ్చే ఆదరణ, డిమాండ్‌ను బట్టి రాబోయే రోజుల్లో మిగిలిన రూట్లకు కూడా విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికులు ఈ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ , ఆర్టీసీ అధికారులు కోరారు.





# అలాంటి అధికారిక కేటగిరీ లేదు

**న్యూఢిల్లీ, జులై 30, అనంతజనశక్తి న్యూస్**

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని, ఇది అత్యంత తీవ్రస్థాయి ''సూపర్ ఎల్‌నినో''గా మారే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం కీలక వివరణ ఇచ్చింది. ''సూపర్ ఎల్‌నినో'' పేరుతో ఎలాంటి అధికారిక కేటగిరీ లేదని స్పష్టం చేసింది. ఎల్‌నినో ప్రభావాన్ని భారత వాతావరణ శాఖ బలహీన, మోస్తరు, బలమైన, అత్యంత బలమైన స్థాయిలుగా మాత్రమే వర్గీకరిస్తుందని తెలిపింది.

రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చిన భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్.. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ), భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెండూ ''సూపర్ ఎల్‌నినో'' పేరుతో ప్రత్యేక కేటగిరీని గుర్తించలేదని వెల్లడించారు. భూమధ్యరేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో ఏర్పడే అసాధారణ పెరుగుదల ఆధారంగా ఎల్‌నినో తీవ్రతను ఐఎండీ అంచనా వేస్తుందని తెలిపారు.

ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతుండటంతో.. కొనసాగుతున్న ఎల్‌నినో అసాధారణంగా తీవ్రంగా మారుతున్నట్లు పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు, వాతావరణ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామం వేగంగా అభివృద్ధి చెందడం, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావాలు చూపే అవకాశం ఉండటంతో కొందరు దీనిని ''సూపర్ ఎల్‌నినో''గా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ పదం ప్రామాణిక వాతావరణ వర్గీకరణలో భాగం



కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఐఎండీ వివరాల ప్రకారం.. 2026 జూన్‌లో బలహీన స్థాయిలో ఎల్‌నినో పరిస్థితులు మొదలయ్యాయి. జూలై నాటికి ఇవి మోస్తరు స్థాయికి చేరుకున్నాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ 2026 మధ్య ఎల్‌నినో ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమయంలో ఎల్‌నినో అత్యంత బలమైన కేటగిరీకి చేరుకోవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

ప్రపంచ వాతావరణ సంస్థ కూడా ''సూపర్ ఎల్‌నినో'' అనే పదాన్ని ఉపయోగించదని తెలిపింది. ఈ పదం ప్రామాణిక, అధికారిక వాతావరణ వర్గీకరణల్లో భాగం కానందున దీనిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించబోమని డబ్ల్యూఎంఓ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే ఎల్‌నినో తీవ్రతను మాత్రమే ఆధారంగా చేసుకుని భారత్‌పై దాని ప్రభావాన్ని ముందుగానే నిర్ధారించలేమని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఎల్‌నినోతో పాటు సముద్రం, వాతావరణం మధ్య ఏర్పడే పరస్పర పరిస్థితులు ఎలా మారుతాయన్న దానిపై భారత్‌లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, ఇతర వాతావరణ ప్రభావాలు ఆధారపడి ఉంటాయని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు భూమధ్యరేఖా పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరగడం వల్ల ఏర్పడే సహజ వాతావరణ దృగ్విషయం. సముద్ర ఉష్ణోగ్రతల్లో ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ ప్రసరణ వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. దీంతో వర్షపాత నమూనాల్లో మార్పులు, సుదీర్ఘ ఉష్ణతరంగాలు, కరువు పరిస్థితులు, ఉష్ణమండల తుపాన్ల తీవ్రతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది.

భారత్‌లో గతంలో బలమైన ఎల్‌నినో సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎల్‌నినో ఒక్కటే భారత రుతుపవనాలను ప్రభావితం చేయదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ ఓషన్ డైపోల్, మాడెన్‌జూలియన్ ఆసిలేషన్ వంటి ఇతర వాతావరణ కారకాలు ఎల్‌నినో ప్రభావాన్ని మరింత పెంచవచ్చు లేదా కొంతవరకు తగ్గించవచ్చు.

ప్రభుత్వం ''సూపర్ ఎల్‌నినో'' అనే పదానికి అధికారిక గుర్తింపు లేదని స్పష్టం చేసినప్పటికీ.. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో బలపడుతున్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఉష్ణతరంగాలు, కరువు, అడవి మంటలు, వర్షపాతంలో అసాధారణ మార్పులు నమోదవుతున్నట్లు సమాచారం.

ఎల్‌నినోతో పాటు ఇతర వాతావరణ కారకాల పరిణామాలను ఐఎండీ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. పరిస్థితులకు అనుగుణంగా కాలానుగుణ వాతావరణ అంచనాలు, దీర్ఘకాలిక అంచనాలు, రోజువారీ ప్రభావ ఆధారిత వాతావరణ హెచ్చరికలను జారీ చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విపత్తు నిర్వహణ సంస్థలు, జిల్లా యంత్రాంగాలతో పంచుకుంటున్నట్లు పేర్కొంది. ఏడాది చివరి వరకు వాతావరణ పరిస్థితుల్లో వచ్చే మార్పులకు ముందస్తు సన్నద్ధత, తగిన చర్యలు తీసుకునేందుకు ఈ హెచ్చరికలు ఉపయోగపడతాయని ఐఎండీ తెలిపింది.

# వారం రోజుల పోలీసు కస్టడీకి నాగరాజు!

సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ సీఐ నాగరాజును సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. తొలుత నాగరాజును విజయవాడ కోర్టులో హాజరుపరచగా.. కస్టడీ విచారణకు ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు.

ఈ కేసులో ట్రయల్ కోర్టు, హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దాంతో వాదనలు విన్న సుప్రీం కోర్టు రాజమండ్రి సెంట్రల్ జైలులో కాకుండా పోలీసుల కస్టడీలోనే నాగరాజును విచారించాలని తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం విజయవాడ కోర్టుకు ఈ రోజు కీలక ఆదేశాలు జారీ చేసింది.

నాగరాజును ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమేసిట్ అధికారులు విచారించాలని స్పష్టం చేసింది. విచారణ సమయం ముగిసిన తర్వాత కూడా నాగరాజుకు భద్రత కల్పించాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ఉంచాలంటూ న్యాయ స్థానం ఆదేశించింది. విజయవాడ కోర్టు అనుమతి అనంతరం నాగరాజును సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నాగరాజును వారం రోజుల పాటు సిట్ తమ కస్టడీలోనే ఉంచి విచారించనున్నారు. ఈ కేసు విచారణ పారదర్శకంగా జరగాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో కచ్చితంగా సీసీటీవీతో పాటు, వీడియో రికార్డింగ్ కూడా ఉండాలని చెప్పింది.

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గాదె సాయి కృష్ణ లాకప్ డెత్ వ్యవహారంలో ఇప్పటి వరకు ఎలాంటి వివరాలు బయటకు రాలేదు. మాజీ సీఐ నాగరాజు ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు నోరు మెదపలేదు. ఈ కేసులో కీలక ఆధారాలు సాధించిన సిట్ అధికారులు.. ప్రధాన నిందితుడు నాగరాజు నుంచి వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు. వారం రోజుల పాటు నాగరాజు పోలీసుల కస్టడీలో ఉండనుండటంతో ఈ





కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అందరూ భావిస్తున్నారు.

## సూపర్ ఎల్ నినోపై
# అప్రమత్తం కావాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సూపర్ ఎల్ నినో ప్రభావంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ చర్యలు, సాగునీటి లభ్యతపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే ప్రతి రైతు ప్రధాని ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదేనని, నీటి వృథాను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాలువల్లో పూడిక తొలగింపు, గట్ల లీకేజీల మరమ్మతులు చేపట్టి నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేయాలని సూచించారు. ఇదే సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలేరు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి నిమ్మల రామానాయుడు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను పరిశీలించిన మంత్రి, పరిస్థితులను పవన్‌కు వివరించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, సాగునీటి నిర్వహణలో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..



# అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు?

**న్యూఢిల్లీ, జులై 30, అనంతజశక్తి న్యూస్**

నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాజ్యసభలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు.

2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.



# నిర్భయంగా పనిచేయండి.. బాధ్యత నేను తీసుకుంటా



**- సీఆర్‌పీఎఫ్ చీఫ్**

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో దైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు.

"సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తాను" అని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

# వాస్తవికంగా ఆలోచించండి.. హోటల్ లైసెన్స్ రద్దుపై కోర్టు



ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించే హోటల్స్‌పై మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేష కఠినచర్యలు తీసుకుంటోంది. పలు ఆహార కేంద్రాల లైసెన్స్‌లు రద్దు చేస్తోంది. ఈ నేపథ్యంలో నవీ ముంబయికి చెందిన ఒక హోటల్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలని ఎఫ్‌డీఏకు సూచించింది. మహారాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌డీఏ నిర్వహించిన డ్రైవ్‌లో దాదాపు 100 హోటళ్ల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. వాటిలో ఓ హోటల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాతపూర్వకంగా తగిన కారణాలు చెప్పకుండా లైసెన్స్ నిలిపివేయడాన్ని ప్రశ్నిస్తూ పిటిషన్ వేసింది. దీనిపై వాదనల అనంతరం హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''కొన్ని రోజుల క్రితం నా టేబుల్ దగ్గరకు ఒక పెద్ద కీటకం వచ్చింది. నేనిప్పుడు ఇలా మాట్లాడుతున్నానో లేదో ఒక ఈగ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో మనం వాస్తవికంగా వ్యవహరించాలి'' అని ధర్మాసనం పేర్కొంది. పరిశుభ్రత, నిర్వహణ, కార్యకలాపాల విషయంలో సంతృప్తికరమైన నివేదిక వచ్చినప్పుడు.. రెండు కీటకాలను చూపించి పూర్తిగా లైసెన్స్ నిలిపివేయడాన్ని సమర్థించలేమని వ్యాఖ్యానించింది. అదే సమయంలో ప్రజారోగ్యాన్ని విస్మరించలేమని కూడా స్పష్టం చేసింది. ఆ హోటల్‌పై సస్పెన్షన్ విధిస్తూ ఎఫ్‌డీఏ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు తోసిపుచ్చింది. కాగా.. ఎఫ్‌డీఏ చర్యను ప్రభుత్వం తరఫు న్యాయవాది సమర్థించారు. ప్రజారోగ్యం విషయంలో ఉదాసీనతతో వ్యవహరించలేమని వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ''అలా అయితే ప్రభుత్వం ఆధ్వర్యంలోని క్యాంటీన్లు, హోటళ్లను తనిఖీ చేశారా..? హైకోర్టు క్యాంటీన్‌లో తనిఖీలు నిర్వహించారా..?'' అని ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వ న్యాయవాది కొన్ని ఉదాహరణలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బీఎంసీ క్యాంటీన్, మంత్రాలయ క్యాంటీన్ లైసెన్స్‌లను నిలిపివేసిన విషయాన్ని ప్రస్తావించారు. దాంతో ''హైకోర్టు క్యాంటీన్‌లో గురువారం తనిఖీలు నిర్వహించి.. శుక్రవారం రిపోర్ట్ ఇవ్వండి'' అని న్యాయస్థానం ఆదేశించింది.

# ఎన్నికల్లో గెలవకుండా ఇంకెంతకాలం మంత్రిగా.. దీపక్‌ప్రకాశ్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.



సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది. లేదా శాసనమండలి సభ్యుడిగానైనా ఎన్నిక కావాలి. కానీ దీపక్ ప్రకాశ్ 2025 నవంబర్‌లో పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఏప్రిల్ 25, 2026 వరకు మంత్రిగా కొనసాగారు. అప్పుడు నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో క్యాబినెట్ మొత్తం రద్దయింది. తర్వాత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా.. దీపక్ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మధ్యలో 22 రోజులు ఏ పదవీలో లేరు. అంటే నిరవధికంగా ఆరునెలల పాటు దీపక్ మంత్రిత్వ బాధ్యతల్లో లేనట్లయ్యింది. సాధారణంగా ఆరు నెలల్లోపు శాసనసభకు ఎన్నిక కాకపోతే.. మంత్రి పదవిని కోల్పోతారు. కానీ ఇక్కడ ఒకే మంత్రి విషయంలో ఆరు నెలల గడువును రెండుసార్లు వినియోగిచడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది.

దీపక్ ) ఎన్నికల్లో గెలవకపోయినా ఆయనను రెండోసారి మంత్రిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. ఇది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని, మంత్రి పదవి కేటాయింపు చెల్లనిదిగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఇది చట్టాన్ని ప్రశ్నించడమే అవుతుంది. ఎన్నిక కాకుండా ఒక మంత్రిని ఆరునెలలకు పైగా ఎలా కొనసాగిస్తున్నారనే దానిపై సమాధానం ఇవ్వాలి'' అని అత్యున్నత న్యాయస్థానం బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తదుపరి విచారణను ఆగస్టు 4కు వాయిదావేసింది.

ఇదిలా ఉంటే.. ప్రమాణస్వీకారం సమయంలో కూడా దీపక్ వార్తల్లో నిలిచారు. ప్రముఖ రాజకీయ నాయకులంతా కుర్తా, పైజామా, ధోవతీలతో రాగా.. దీపక్ మాత్రం చాలా డిఫరెంట్ లుక్‌లో కనిపించి, అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు. క్యాజువల్ షర్ట్, ప్యాంట్ ధరించిన ఆయన.. అదే వేదికపై ఉన్న ప్రధాని మోదీని కలిశారు. రాష్ట్రీయ లోక్ మోర్చా చీఫ్ ఉపేంద్ర కుశ్వాహా కుమారుడే ఈ దీపక్. ఆయన తల్లి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

# నాడు 'దీదీ'ని వెళ్లగొట్టకుండా ఉంటే..! ప్రియాంకా గాంధీతో కల్యాణ్ బెనర్జీ



కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీతో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాడు మమతా బెనర్జీ ని పార్టీ నుంచి వెళ్లగొట్టకపోయి ఉంటే, ప్రధాన ప్రతిపక్ష పార్టీ (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) ఇలాంటి పరిస్థితుల్లో ఉండేది కాదన్నారు. తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలపై అవమానకర వ్యాఖ్యలు చేయడంతో లోక్‌సభ నుంచి సస్పెన్షన్‌కు గురైన కల్యాణ్ బెనర్జీ పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ప్రియాంక-కల్యాణ్ బెనర్జీల మధ్య జరిగిన సరదా సంభాషణ ఆసక్తికరంగా సాగింది. నిరసన చేస్తున్న కల్యాణ్ బెనర్జీ వద్దకు వచ్చిన ప్రియాంకా గాంధీ .."ఆ తిరుగుబాటు ఎంపీలలో కొందరు మొదట కాంగ్రెస్‌ను వీడి టీఎంసీలో చేరారు. చివరకు ఈమధ్య నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిపోయారు" అని నవ్వుతూ అన్నారు. దీనికి కల్యాణ్ బదులిస్తూ.. 'పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా బలం లేదు. దీంతో వాళ్లు 2014లో మిమ్మల్ని వీడారు. ఆ తర్వాత మా పార్టీ టికెట్‌పైనే గెలుపొందారు' అని చెప్పారు. అక్కడే ఉన్న ఎంపీ పప్పూ యాదవ్ జోక్యం చేసుకుంటూ.. వాస్తవానికి వాళ్లంతా కాంగ్రెస్ సభ్యులే అని చెప్పారు. దీంతో అప్పట్లో తాను కూడా కాంగ్రెస్ వ్యక్తినేనని, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశానని కల్యాణ్ కౌంటర్ ఇచ్చారు. 'కాంగ్రెస్ నుంచి దీదీని వెళ్లగొట్టారు.. దాని గురించి కూడా మాట్లాడండి. 1997లో మమతా బెనర్జీని బయటకు గెంటేశారు. అలా చేసి ఉండకపోతే కాంగ్రెస్ ఈ స్థితిలో ఉండేది కాదు" కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. ప్రియాంక స్పందిస్తూ.. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దీదీ అంటే ఎంతో గౌరవం ఉండేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దీదీకి మద్దతుగా నిలుస్తోందని పప్పూ యాదవ్ చెప్పగా.. అది నిజమేనని కల్యాణ్ బెనర్జీ అన్నారు .

# హామీని కేంద్రం నిలబెట్టుకోవాలి: వాంగ్‌చుక్

యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకమని పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్ అన్నారు. అప్పడే అద్భుతమైన దేశ నిర్మాణం సాధ్యపడుతుందని చెప్పారు. 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు.

కేవలం పరీక్షల్లో మాత్రమే కాకుండా.. దేశ విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకొచ్చేందుకు ఈ బిల్లు దోహదం చేస్తుందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో దిల్లీలో చోటు చేసుకున్న ఆందోళనలపైనా ఆయన మాట్లాడారు. ఆందోళనకారులపై నమోదైన కేసులను కొట్టివేస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం దానికి కట్టుబడి ఉండాలన్నారు. ఆందోళకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) పదేపదే ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం, లేదంటే మరోసారి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో వాంగ్‌చుక్ ఇలా స్పందించారు. దిల్లీ నుంచి శ్రీనగర్‌కు వందేభారత్ రైల్లో ప్రయాణించిన ఆయన.. భారతీయ రైల్వేను చూస్తే గర్వంగా ఉందని కొనియాడారు. చీనాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందన్నారు. తన బృందంతో కలిసి ఒక రోజు కశ్మీర్‌లో గడిపిన తర్వాత.. లద్దాఖ్‌కు బయల్దేరి వెళ్తామని చెప్పారు.



# ఆ మందుగుండు సామగ్రి రికార్డులను భద్రపర్చండి:



**- పెల్లెట్ గన్ విమర్శలపై సుప్రీంకోర్టు**

కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో నిరసన చేపట్టిన విద్యార్థులపైకి భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ వినియోగించారంటూ తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు గురువారం సుముఖత వ్యక్తంచేసింది. అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడటాన్ని పోలీసు నిబంధనలు అనుమతిస్తున్నాయని పేర్కొంది. అదే సమయంలో ఇటీవలి ఆందోళనలో పోలీసులు వాడిన మందుగుండు సామగ్రి లాగ్ రికార్డులను భద్రపరచాలని కేంద్రాన్ని ఆదేశించింది. పెల్లెట్ల కారణంగా గాయపడిన వారికి చికిత్స అందేలా చూడాలని దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

నిరసనల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ లోహపు పెల్లెట్లు వాడిందని, గాయపడిన ఆందోళనకారుల శరీరం నుంచి వైద్యులు వాటిని తొలగించారని పిటిషనర్లు పేర్కొన్నారు. ''ఆర్ఏఎఫ్ సిబ్బంది పెల్లెట్ గన్స్ వాడకూడదని మేం చెప్పడం లేదు. కానీ ఇక్కడ పరిస్థితి వేరు. వారు లోహపు పెల్లెట్లు వాడారు. వాటిని నిషేధించాలి'' అని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. పెల్లెట్ గన్స్ వాడే విషయంలో ఉన్న నిబంధనలు పరిశీలించకుండా వాటిని నిషేధించాలనే అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని న్యాయస్థానం పేర్కొంది.

# ప్రధాని మోదీ పేరిట ఆ లేఖ.. నకిలీది : పీఐబీ ఫ్యాక్ట్‌చెక్



దేశ రాజధాని దిల్లీలో విద్యార్థుల నిరసన జరిగినప్పటి నుంచి ప్రధాని మోదీ పేరిట పలు నకిలీ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీటిని ఇప్పటికే కేంద్రం ఖండించిన సంగతి తెలిసిందే. తాజాగా మోదీ సంతకం చేసిన లేఖ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ప్రధాని రాజీనామా చేశారంటూ పలువురు దానిని షేర్ చేస్తున్నారు. దీనిపై కేంద్రం ఆధ్వర్యంలోని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పష్టత ఇచ్చింది. ''ప్రధాని మోదీ సంతకం చేసినట్టుగా ఉన్న లేఖ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదొక నకిలీ లేఖ. ప్రధాని సంతకం చేసిన అలాంటి లెటర్ ఏదీ జారీ కాలేదు. ఏదైనా ప్రచారాన్ని నమ్మడానికి ముందు.. అధికారికంగా ధ్రువీకరించుకోండి. ఏదైనా సమాచారం అనుమానాస్పదంగా అనిపించినప్పుడు సమాచారం ఇవ్వండి'' అని పీఐబీ ప్రజలను అప్రమత్తం చేసింది. ఇలాంటి తప్పుడు సమాచారంపై సంప్రదించేందుకు (91 8799711259, factcheck@pib.gov.in) ఫోన్ నంబర్, మెయిల్ ఐడీని షేర్ చేసింది.

# రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు



ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించబోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

**ఆయన రాజీనామా చేసి మోదీ కుర్చీ కాపాడారు: ఖర్గే**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. ''నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందే'' అని అన్నారు.

# వందేమాతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**'వందేమాతరం' బిల్లును ఆమోదించింది. విపక్షాల ఆందోళనల మధ్యే మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లును రాజ్యసభ బుధవారం ఆమోదించిన సంగతి తెలిసిందే. వందేమాతర గేయాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేందుకే కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది.**

**వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేసింది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఇది చట్టంగా మారనుంది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. మరోవైపు ఈ బిల్లుపై ఓటింగ్ ముగిసిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభను రేపటికి వాయిదా వేశారు.**



# ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆహార కల్తీ!

ఆహారం... జీవకోటికి ప్రాణాధారం. మానవ మనుగడకు ప్రాథమిక అవసరం. అదిప్పుడు స్వార్థపరుల చేతుల్లో విషంగా మారుతోంది. పాలు, నూనెలు, మసాలాలు, పండ్లు, పసిపిల్లల పాలపొడిదాకా ప్రతిదీ కల్తీమయమవుతోంది. ఇది కేవలం ఒక చట్టపరమైన నేరమో, వ్యాపార మోసమో కాదు; యావత్ సమాజంపై జరుగుతున్న నిశ్శబ్ద దాడి!

ఆహార కల్తీ కారణంగా వైద్య ఖర్చులు పెరిగి, ఉత్పాదకత దెబ్బతిని కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతున్నాయి. ప్రభుత్వాల ఆరోగ్య వ్యయాలూ విపరీతంగా పెరుగుతున్నాయి. అనారోగ్యాలతో వైద్య ఖర్చులు అధికమై ఉత్పాదకత తగ్గి అంతర్జాతీయంగా ఏటా దాదాపు 26 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం ప్రవేశపెట్టిన 'ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్)' క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపడుతోంది. ఈ విభాగం ఏర్పాటైన వందరోజుల్లో నమోదు చేసిన 185 కేసుల్లో సుమారు 121.87 టన్నుల అత్యంత ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. మరో 250 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అప్పగించింది. ఆధునిక పారిశ్రామికీకరణ, అంతర్రాష్ట్ర వాణిజ్యం, ఈ-కామర్స్, రవాణా రంగాల్లోని విప్లవాత్మక పురోగతి ఆహార కల్తీకి సంఘటిత నేరం రూపంలో కొత్త స్వరూపాన్ని ఇచ్చింది. ఒకే బ్యాచ్‌లో తయారైన కల్తీ ఆహారం క్షణాల్లో వేలాది ఇళ్లకు చేరి ప్రజల ఒంట్లోకి చేరుతుంది. దీని దుష్ప్రభావాలు కొంతకాలం తర్వాత దీర్ఘకాలిక వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. దీనివల్ల బాధితులు తమ అనారోగ్యానికి అసలు కారణం కల్తీ ఆహారమేనని గుర్తించలేని విషాదకర స్థితి నెలకొంటోంది. అందుకే దీన్ని సమాజంపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడిగా భావించాలి.

**విదేశాల్లో మేలిమి విధానాలు**

కల్తీ మహమ్మారిని ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సమాజం అవలంబిస్తున్న విధానాలు మనకెన్నో పాఠాలు నేర్పుతాయి. అమెరికాలోని ఎఫ్‌డీఏ అమలు చేస్తున్న ఆహార భద్రత ఆధునికీకరణ చట్టం కల్తీ జరగక ముందే అడ్డుకోవడంపై దృష్టి పెడుతుంది. ఐరోపా యూనియన్ అవలంబిస్తున్న ఫామ్ టు ఫోర్క్ విధానం ఆహార సరఫరా గొలుసులో పారదర్శకతను పెంచుతోంది. సింగపూర్, చైనా కూడా కల్తీ రుజువైతే భారీ జరిమానాలు, కఠినమైన జైలు శిక్షలు విధిస్తున్నాయి. మన దేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి వ్యవస్థలు ఉన్నా, వాటి పరిధి ప్రధానంగా నాణ్యత నిబంధనల రూపకల్పన, లైసెన్సుల మంజూరుకే పరిమితమవుతోంది. స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్తంగా ఏకీకృత ఆహార ప్రమాణాలను నిర్దేశించేందుకు ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 స్థానంలో వచ్చిన ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006 ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి వ్యవస్థలను ఏర్పరిచింది. అధికారులకు తనిఖీలు, నమూనాల సేకరణకు చట్టపరమైన అధికారాన్ని ఇచ్చింది. కానీ, ప్రస్తుత సవాళ్లను తట్టుకోవడానికి ఈ చట్ట పరిధి సరిపోవడం లేదు.

ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006లోని శాస్త్రీయ, నియంత్రణ విధులను యథాతథంగా కొనసాగిస్తూనే- సంఘటిత రూపం దాల్చిన తీవ్రమైన కేసుల్లో నేర న్యాయవ్యవస్థను మరింత పటిష్ఠంగా అనుసంధానం చేయాలి. లాభార్జనే ధ్యేయంగా విషపూరిత పదార్థాలను ఆహారంలో కలిపి వేలమంది ప్రాణాలను పణంగా పెట్టే కల్తీదారులను, కేవలం నాణ్యతా ప్రమాణాల్లో స్వల్ప లోపాలకు బాధ్యులైన సాధారణ విక్రేతలతో సమానంగా చూడలేం. అందుకే, బీఎన్ఎస్-2023 లేదా ఆహార భద్రతా చట్టం పరిధిలో తీవ్ర స్వరూపంగల ఆహార కల్తీ అనే ప్రత్యేక నేర విభాగాన్ని ప్రవేశపెట్టడం అత్యంత అవసరం. దీంతోపాటు బీఎన్ఎస్-23లోనూ తగిన సవరణలు చేయడం ద్వారా తీవ్రమైన ఆహార నేరాలపై క్రిమినల్ న్యాయవ్యవస్థ పూర్తిస్థాయిలో స్పందించేలా మార్గాలను సుగమం చేయాలి. ఈ క్లిష్టమైన నేరాలను ఎదుర్కోవడానికి పాలసీ, అథారిటీ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ల మధ్య ఏకీకృత త్రిముఖ వ్యూహం అవసరం. ఇందుకు జాతీయ స్థాయిలో ఒకే రకమైన లక్ష్యాలతో సమగ్ర నేషనల్ ఫుడ్ క్రైమ్ పాలసీని రూపొందించాలి. ఈ విధానాన్ని అమలు చేయడానికి ఎన్‌సీబీ, ఎన్ఐఏ తరహాలో స్వతంత్ర దర్యాప్తు, అరెస్ట్ అధికారాలు కలిగిన ఒక జాతీయ ఆహార భద్రతా అథారిటీని ఏర్పాటు చేయాలి. సరిహద్దుల లొసుగులను పూడ్చడానికి సదరు అథారిటీ కింద నేషనల్ ఫుడ్ క్రైమ్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ పనిచేయాలి. అథారిటీ పరిధిలోనే కేంద్రీకృత ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడం ద్వారా శాస్త్రీయ ఆధారాలను కోర్టుల ముందుంచి దోషులకు వేగంగా శిక్షలు పడేలా చేయవచ్చు.

**విస్తృత అవగాహన అవసరం**

ఆహార కల్తీని అరికట్టేందుకు పోలీస్, ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ఉమ్మడి కార్యాచరణను అమలు చేయాలి. క్షేత్రస్థాయి పరిశోధనలకు ఏఐ ఆధారిత రాపిడ్ స్క్రీనింగ్ టూల్స్, బ్లాక్‌చైన్ సాంకేతికత ఆధారిత 'ఫార్మ్-టు-ఫోర్క్' ట్రేసబిలిటీ విధానాలను జోడించాలి. మొబైల్ టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా తనిఖీలను గ్రామీణ స్థాయిలోనూ చేపట్టినప్పుడే కల్తీ మూలాలను సులభంగా పట్టుకోవచ్చు. ఆహార కల్తీలపై తక్షణ ఫిర్యాదులకు ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్ తీసుకురావాలి. ఆహార కల్తీ నిరోధంలో పౌరుల్లో నెలకొన్న ఉదాసీనత, నిర్లిప్త ధోరణులు మంచివి కావు. కల్తీని చూసీచూడనట్లు వదిలేస్తే, భావితరాల భవిష్యత్తు బుగ్గిపాలవుతుందనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఆహార వ్యాపారులూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. వినియోగదారులు సైతం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ఇళ్లలోనే సులభంగా కల్తీని గుర్తించేందుకు వీలు కల్పించే 'ఎఫ్ఎస్ఎస్ఏఐ డార్ట్' కిట్ల వాడకంపై అవగాహన పెంచుకోవాలి. ఆహార అక్రమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా అధికారుల దృష్టికి తీసుకురావాలి. పాఠశాల స్థాయి నుంచే ఆహార భద్రతపై నవతరానికి విస్తృత అవగాహన కల్పించాలి. ప్రభుత్వాల దృఢ సంకల్పం, వ్యాపారుల నైతిక ప్రవర్తన, క్రియాశీలక ప్రజా చైతన్యం తోడైనప్పుడే కల్తీరహిత సమాజం సాకారమవుతుంది.



# గిరాకీ అధికం... రైతుకూ ప్రయోజనం!



ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రస్తుతం చాలామంది ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారానికి ప్రాధాన్యమిస్తున్నారు. దాంతో డ్రాగన్ ఫ్రూట్స్, చియా సీడ్స్, అవొకాడో వంటి వాటికి గిరాకీ పెరుగుతోంది. సలాడ్‌లలో ఉపయోగించే లెట్యూస్, కైల్ తదితర విదేశీ ఆకుకూరలు, ఇంగ్లిష్ క్యుకుంబర్ వంటి కూరగాయలకూ డిమాండ్ అధికమవుతోంది. వాటి సాగును వీలైనంతగా ప్రోత్సహిస్తే మన రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. భారతదేశంలో 2023లో కివీ, డ్రాగన్ ఫ్రూట్స్, అవొకాడో, ప్యాషన్ ఫ్రూట్, మ్యాంగో స్టీన్ వంటి విదేశీ పండ్ల మార్కెట్ విలువ 120 కోట్ల డాలర్లు. ఇది 2030కల్లా రెట్టింపు అవుతుందని అంచనా. అలాగే 2034కల్లా బెల్ పెపర్స్, లెట్యూస్, బ్రొకొలి వంటి విదేశీ కూరగాయల మార్కెట్ పరిమాణం 684 కోట్ల డాలర్లకు పెరగనుంది. బ్రొకొలి, రంగు క్యాప్సికమ్ వంటి విదేశీ కూరగాయలకు హెక్టారుకు 150-200 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు పరిశీలనలు చెబుతున్నాయి. మార్కెట్లో వాటికి అధిక ధరలూ లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో కొందరు రైతులు వరి, పత్తి వంటి సాంప్రదాయ పంటల నుంచి అధిక ఆదాయాన్ని ఇచ్చే అవొకాడో, చియా విత్తనాలు తదితరాల సేద్యానికి మళ్లుతున్నారు. పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఐటీ రంగానికి వీడ్కోలు చెప్పి ఆర్గానిక్ కూరగాయలు, విదేశీ పండ్లు, ఆకుకూరలను పండిస్తున్నారు. వ్యవసాయ వ్యవస్థాపకులు పాలీహౌస్‌లు ఏర్పాటుచేసి బిందుసేద్యంతో కొత్త తరహా పంటలు పండిస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో వినియోగదారులు ప్రీమియం ధరలు చెల్లించి వాటిని కొనుగోలు చేస్తున్నారు.

**సాగుకు సర్కారీ సహకారం**

తెలంగాణలో డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు ఎకరాకు రూ.1.60 లక్షల వరకు సబ్సిడీ అందుతోంది. సంగారెడ్డి, హన్మకొండ, నల్గొండ ప్రధాన సాగు కేంద్రాలుగా మారాయి. మార్కెట్లో ఒక్కో డ్రాగన్ పండు రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తున్నట్లు అంచనా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖ, విజయనగరం, అల్లూరి సీతారామరాజు వంటి జిల్లాల్లో అవొకాడో, స్ట్రాబెర్రీ సాగును ప్రోత్సహిస్తోంది. ఏపీ గిరిజనాభివృద్ధి సంస్థ మన్యం, పాడేరు, చింతపల్లి వంటి చోట్ల అవొకాడో సాగుకు ఊతమిస్తోంది. ఏపీలో క్వినోవా, చియా విత్తనాల సాగుకూ ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో గ్యాక్‌ఫ్రూట్ సాగు అవకాశాలను పరీక్షిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతులు ఇంకా బ్రెజిలియన్ జబుటికాబా, రాంబుటాన్, లోంగాన్, ప్యాషన్ ఫ్రూట్, స్టీవియా వంటి వాటిలోనూ ప్రయోగాలు చేస్తున్నారు. తెలంగాణలోని సంగారెడ్డి ప్రాంతంలో చియా సాగుతో ఎకరాకు లక్ష రూపాయల వరకు లాభం వస్తోందని నిపుణులు చెబుతున్నారు. చియా సాగుకు పెద్దగా నీరు అవసరం లేదు. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో అవొకాడో రైతులకు మొదటి సంవత్సరం హెక్టారుకు రూ.18వేల సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. మార్కెట్లో కిలో అవొకాడో పండ్ల ధర రూ.300 వరకు పలుకుతోంది. బ్లూబెర్రీ సాగుకూ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అండదండలందిస్తున్నాయి. హైదరాబాద్ మార్కెట్ కోసం నగర శివారుల్లో ఇంగ్లిష్ దోసకాయలు, లెట్యూస్, కైల్ వంటి సలాడ్ కూరల సాగు విస్తరిస్తోంది. తిరుపతిలో కూడా వీటిని హైడ్రోపోనిక్ పద్ధతిలో సాగుచేస్తున్నారు. తెలంగాణలో డెక్కన్ ఎగ్జోటిక్స్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన పంటల విశ్వవిద్యాలయం వంటివి రైతులకు శిక్షణ, నాణ్యమైన మొక్కలను అందిస్తున్నాయి.

**సమస్యలను అధిగమిస్తేనే...**

విదేశీ కూరగాయలు, పండ్ల సాగుకు కావాల్సిన నెట్‌హౌస్‌లు, పాలీహౌస్‌ల ఏర్పాటుకు అధిక పెట్టుబడి అవసరం. వాటి విత్తనాలు ఖరీదైనవే కాకుండా సులభంగా అందుబాటులో ఉండట్లేదు. వాటి సాగుకు నిర్దిష్ట ఉష్ణోగ్రత కావాలి. పోషకాలు, నీటిని నిర్ణీత సమయాల్లో, తగిన పరిమాణాల్లో కచ్చితంగా అందించాలి. సరైన శీతల గిడ్డంగులు లేకపోతే పండ్లు, కూరగాయలు త్వరగా చెడిపోతాయి. పట్టణ మార్కెట్లపైనే ఆధారపడటమూ సమస్యలు తెచ్చిపెట్టవచ్చు. గిరాకీ కన్నా సరఫరా ఎక్కువైతే ధరలు పడిపోతాయి. వీటన్నింటిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలు, బయో పురుగుమందులు, సేంద్రియ ఎరువులను అందించాలి. బీమా పథకాలు వర్తింపజేయాలి. చిల్లర అమ్మకాల సంస్థలు, ఎగుమతి కంపెనీలతో అన్నదాతలకు భాగస్వామ్యాలను కుదర్చాలి. పంట నాణ్యత ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందించాలి. లాభసాటి ధరలకు పంటల కొనుగోలుకు భరోసానివ్వాలి. అధిక విలువగల పండ్ల ఎగుమతి వ్యవస్థను అభివృద్ధి చేయాలి. నగరాల శివారు ప్రాంతాల్లో కూరగాయల సాగును ఒక ప్రజా ఉద్యమంలా ప్రోత్సహించాలి.

# ఆంక్షలను ధిక్కరించిన ఉక్కు సంకల్పం



భారతదేశ అణు ప్రయాణం, దాని వెనుక ఉన్న వ్యూహాత్మక నిర్ణయాలు, చారిత్రక సవాళ్ల గురించి అభిజిత్ చావ్డా ఈ ఎపిసోడ్‌లో మాట్లాడారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి.) వెనుక ఉన్న వివక్ష, పోఖ్రాన్ పరీక్షల ద్వారా భారత్ సాధించిన విజయం వంటి అంశాలను ప్రస్తావించారు: 'అగ్ర దేశాలు 1968లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని ఖరారు చేసినప్పుడు, వారు ఒక స్పష్టమైన గీత గీశారు. 'మా దగ్గర 1967 కంటే ముందే అణ్వాయుధాలు ఉన్నాయి కాబట్టి మేము వాటిని ఉంచుకుంటాం, కానీ మిగతా వాళ్లు ఎవరూ వాటిని తయారు చేసుకోకూడదు' అని! నా దృష్టిలో ఇది ఆయుధాలను నియంత్రించే ఒప్పందం కాదు. కేవలం కొన్ని దేశాలకే ప్రాధాన్యం ఇచ్చే ఒక వివక్షతో కూడిన రాజకీయం. మన పొరుగు దేశాలు శత్రువులుగా మారుతున్న సమయంలో, ఇండియా తనను తాను రక్షించుకునే సార్వభౌమ హక్కును వదులుకుంటూ ఈ ఒప్పందంపై సంతకం చేయాలని వారు ఆశించారు. ఇండియా ఎన్‌పీటీపై సంతకం చేయకపోవడం మొండితనం కాదు, అది మనుగడ కోసం తీసుకున్న స్పష్టమైన నిర్ణయం.

**భాభా 'మరణం' వెనుక అమెరికా!**

"1966లో డాక్టర్ హోమీ భాభా మరణం చుట్టూ ఉన్న చీకటి కోణాలను, ఆయన అద్భుతమైన ఆలోచనలను అర్థం చేసుకోకుండా ఇండియా అణు ప్రయాణాన్ని మనం తెలుసుకోలేం. ఆ కాలపు చారిత్రక పరిణామాలను బట్టి చూస్తే, ఆల్ప్స్ పర్వతాలపై జరిగిన ఎయిర్ ఇండియా ఫ్లయిట్ 101 ప్రమాదంలో భాభా మరణించడం ఒక ప్రమాదం కాదని నేను గట్టిగా నమ్ముతాను. అది ఇండియా అణు సామర్థ్యాలను సాధించడానికి ఎంత దగ్గరగా ఉందో చూసి భయపడిన విదేశీ నిఘా సంస్థలు - ముఖ్యంగా సి.ఐ.ఎ. - పన్నిన ఒక కుట్ర. మనం 18 నెలల్లోనే అణు పరికరాన్ని తయారు చేయగలమని భాభా బహిరంగంగానే ప్రకటించారు. ఆయనను నిర్మూలించడం ద్వారా, విదేశీ శక్తులు మన అణు పురోగతిని కొన్ని దశాబ్దాల వెనక్కి నెట్టాయి.

**ఆచితూచిన పేరు 'స్మైలింగ్ బుద్ధ'**

"మనం 1974లో పోఖ్రాన్-1 పరీక్షను నిర్వహించినప్పుడు, దానికి 'శాంతియుత అణు విస్ఫోటం' (పి.ఎన్.ఇ.-పీస్‌ఫుల్ న్యూక్లియర్ ఎక్స్‌ప్లోషన్) అని పేరు పెట్టి, 'స్మైలింగ్ బుద్ధ' అనే రహస్య కోడ్‌ను ఉపయోగించాం. ఈ పేరు పెట్టడం ఆనాటి మన రాజకీయ నాయకత్వంలో ఉన్న తీవ్రమైన భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లను, లోతైన సంకోచాన్ని తెలియజేస్తుంది. ముఖ్యంగా 1971 భారత్-పాక్ యుద్ధంలో పాక్‌కు అనుకూలంగా భారత్‌పై ఒత్తిడి తేవటానికి అమెరికా తన ఏడవ నౌకాదళాన్ని (సెవెంత్ ఫ్లీట్) బంగాళాఖాతంలో మోహరించిన తర్వాత, మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించాలని అనుకున్నాం. కానీ మనం ఒక అణు దేశ మని బహిరంగంగా ప్రకటించుకునే ధైర్యాన్ని అప్పట్లో ప్రదర్శించలేకపోయాం. ఈ 'వ్యూహాత్మక అస్పష్టత' (ఎటూ తేల్చని విధానం) అనే పాలసీ వల్ల 24 ఏళ్లపాటు దౌత్యపరమైన సందిగ్ధతలోనే ఉండిపోయాం. ఆఖరికి 1998లో వాజ్‌పేయి నాయకత్వంలో జరిగిన పోఖ్రాన్ -2 పరీక్షలు మాత్రమే, ఇండియా ఒక అణు దేశం అనే నిజాన్ని ప్రపంచానికి స్పష్టం చేశాయి.

"కొరతగా ఉన్న యురేనియంకు బదులుగా, మన దేశంలో సమృద్ధిగా ఉన్న థోరియం నిల్వలపై ఆధారపడిన మన 'మూడంచెల అణు విద్యుత్ కార్యక్రమం' భారతీయ శాస్త్రవేత్తల స్వయం సమృద్ధికి ఒక గొప్ప నిదర్శనం. 1974 అణు పరీక్షల తర్వాత పాశ్చాత్య దేశాలు మనపై కఠినమైన ఆంక్షలు విధించినప్పుడు, మన అణు రియాక్టర్లకు ఇంధనం అందకుండా చేసి, మనల్ని లొంగి పోయేలా చేయవచ్చని వారు భావించారు. కానీ వారి అహంకారం పూర్తిగా తిరగబడింది. కల్పక్కం వంటి కేంద్రాల్లోని మన శాస్త్రవేత్తలు ఒంటరిగానే కొత్త ఆవిష్కరణలు చేశారు. మరెవరూ ప్రాధాన్యం ఇవ్వని 'ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు', 'థోరియం వినియోగ చక్రాల'పై పట్టు సాధించారు. ప్రపంచ దేశాలు మనల్ని ఒంటరిని చేసినప్పటికీ, ఇండియా ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచే సాంకేతికతను తన సొంత శక్తితో ఎలా నిర్మించు కోగలదో నిరూపించిన గొప్ప విజయ చిహ్నం అది.

# సీఎస్‌డీఎస్ భవిష్యత్తేమిటి?

**ఉన్నత విద్యా సంస్థలకు వ్యతిరేకంగా కూడా బుల్డోజర్ న్యాయం అమలవుతోంది! న్యూఢిల్లీలోని 'అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన కేంద్రం' (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్– సీఎస్‌డీఎస్)కు ప్రభుత్వ ఆర్థిక సహాయంలో భారీ కోత విధించేందుకు ప్రభుత్వం పూనుకున్నట్టు ఈ నెల 10న వార్తలు వెలువడ్డాయి. సీఎస్‌డీఎస్ ఉనికిని రూపుమాపేందుకే ఆర్థిక సహాయం నిలిపివేతకు ప్రభుత్వం పూనుకున్నదనడంలో సందేహం లేదు.**

బుల్డోజర్ న్యాయంలో వలే ఇక్కడ కూడా చట్ట నియమాలను తలకిందులు చేయడం జరిగింది. నేర న్యాయ నిర్ణయం (క్రిమినల్ జస్టిస్) ఒక నిర్దిష్ట క్రమంలో ఉంటుంది: ఒక నేరం సంభవిస్తుంది; దానికి రుజువులు లభిస్తాయి; అవి సంశయాత్మకంగా ఉంటాయి; సంశయాలు విచారణకు దారి తీస్తాయి; విచారణ నేర నిర్ధారణకు, శిక్షకు దోహదం చేస్తుంది. సీఎస్‌డీఎస్ విషయంలో ఈ ప్రక్రియ ముందుగానే గుర్తించిన అపరాధిపై బహిరంగంగా నేరారోపణతో ప్రారంభమయింది. న్యాయ సమర్థనకు అవసరమైన సాకులు సృష్టించారు. శిక్షను ఇంకా అమలుపరచక పోయినా ముందుగానే నిర్ణయమయింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలతో సంబంధమున్న సంస్థలు, వ్యక్తులు అందరికీ హెచ్చరికగా ఉండేలా ఆ శిక్ష విస్తృత ప్రభావశీలంగా ఉంటుంది.

భారతీయ వైజ్ఞానిక శాస్త్రాలకు ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) ఎలాంటివో భారతీయ సామాజిక శాస్త్రాలకు సీఎస్‌డీఎస్ అలాంటిది. దేశంలోను, విశాల ప్రపంచంలోను అగ్రశ్రేణి మేధావిగా సుప్రసిద్ధుడైన రజనీ కొఠారి 1963లో స్థాపించిన ఈ ఉన్నత విద్యా సంస్థలో స్వతంత్ర భారతదేశ మొదటి రెండు తరాల విఖ్యాత సామాజిక శాస్త్రవేత్తలు ఎందరో అధ్యాపకులుగా ఉన్నారు. ఆర్థికవేత్తలు, ప్రస్తుత అధ్యాపకులను మినహాయిస్తే ఆ ప్రముఖుల జాబితాలో అశీస్ నంది, డి.ఎల్ శేథ్, రామాశ్రయ్ రాయ్, గోపాల్ కృష్ణ, బషీరుద్దీన్ అహ్మద్, గిరి దేశింగ్‌కార్, సుధీర్ కాకర్, శివ్ విశ్వనాథన్, హర్ష్ సేథీ, సురేశ్ శర్మ, డి.ఆర్ నాగరాజ్, వి.బి సింగ్, రాజీవ్ భార్గవ, షయిల్ మాయారామ్, ఆదిత్య నిగమ్, అభయ్ దూబె తదితర మేధా దిగ్గజాలు ఉన్నారు. ఇంకా సుఖ్మోయ్ చక్రవర్తి, టి.ఎన్ మదన్, దీపక్ నయ్యర్, జేపీఎస్ ఓబరాయ్, మనోరంజన్ మొహంతి, పాట్రిషియా ఓబరాయ్, సుహాస్ పల్శీకర్ మొదలైన పండిత ప్రకాండులు కూడా సీఎస్‌డీఎస్ విస్తృత విద్యా కుటుంబంలోని వారే. రాజకీయాలు, సమాజం, సంస్కృతిపై మనదేశంలోను, ప్రపంచ వ్యాప్తంగాను మేధా చర్చలలో సీఎస్‌డీఎస్ ఎందుకు ఒక ముఖ్య కేంద్రంగా ఉన్నదో ప్రస్తావిత అధ్యాపకుల జాబితా విశదం చేస్తుంది.

ప్రచ్ఛన్నయుద్ధ కాల సైద్ధాంతిక సమరంలో సీఎస్‌డీఎస్ ఒక మార్క్సిస్టేతర ఆలోచనా స్రవంతికి పేరు పొందింది. మార్క్సిస్టు భావజాలాన్ని అదెప్పుడూ వ్యతిరేకించలేదు. సామాజిక శాస్త్రాలను వలసవాద ఆలోచనలు, ప్రభావాల నుంచి విముక్తం చేసే అజెండా సీఎస్‌డీఎస్ మేధా ప్రస్థానంలో ఒక ముఖ్య భాగం. భారతీయ భాషలలో సామాజిక శాస్త్రాల అధ్యయనానికి పథ నిర్దేశం చేసింది కూడా సీఎస్‌డీఎస్ కావడం విశేషం. 1970 దశకంలో ఇందిర విధించిన ఎమర్జెన్సీని సీఎస్‌డీఎస్ తీవ్రంగా ప్రతిఘటించింది. అయితే 2014 నుంచి మారిన రాజకీయ పరిస్థితులలో ఈ సంస్థ ఉద్దేశపూర్వకంగానే తన రాజకీయ కార్యకలాపాలను తగ్గించుకున్నది.

సీఎస్‌డీఎస్‌ను బుల్డోజర్ దాడికి ఎందుకు ఎంపిక చేసుకున్నారో అర్థం చేసుకోవడం కష్టం. భారత ప్రజాస్వామ్య రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనను అధ్యయనం చేసేందుకు 1997లో సీఎస్‌డీఎస్ ప్రారంభించిన లోక్‌నీతి కార్యక్రమమే ప్రధాన కారణమని నేను భావిస్తున్నాను. సర్వేల నిర్వహణలో ప్రామాణిక పద్ధతులకు, సమాచార నివేదనలో పారదర్శకతకు ఎటువంటి మినహాయింపులు లేకుండా నిబద్ధమై ఉన్న ఆ పరిశోధనా కార్యక్రమం గత మూడు దశాబ్దాలుగా దేశ పరిపాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు విశ్వసనీయమైన ఆధారంగా ఉన్నది. పాలకుల వ్యక్తిగత అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఆ పరిశోధనా పద్ధతులను మార్చడం ఎట్టి పరిస్థితులలోను జరగదు. నిరంకుశ ప్రభుత్వాలు ఇటువంటి పరిశోధనలను హర్షించవు. ప్రజల్లో అశాంతి పెచ్చరిల్లుతున్న పరిస్థితులలో ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పుడు లోక్‌నీతి సర్వేలను పాలకులు సహిస్తారా? గతంలో సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్‌ను తీవ్ర ఆంక్షలకు గురి చేసినట్టుగానే ప్రపంచవ్యాప్తంగా సామాజిక శాస్త్ర జగత్తులో పేరు ప్రతిష్ఠలు ఉన్న సీఎస్‌డీఎస్‌ను కూడా పూర్తిగా కట్టడి చేస్తే విద్యావేత్తలు, మేధావులకు ఒక గట్టి సందేశాన్ని పంపవచ్చని పాలకులు భావించి ఉంటారు. సీపీఆర్, సీఎస్‌డీఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించేవారికి ఎటువంటి భద్రత ఉండబోదు అన్నదే ఆ సందేశం.

సీఎస్‌డీఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. దానిపై చర్యకు ఒక కారణాన్ని కనుగొనాలి. హాస్యాస్పదమైన అల్ప కారణమొకటి లభించింది. మహారాష్ట్రలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో హెచ్చు తగ్గులు అసాధారణంగా ఉన్నాయంటూ సంబంధిత గణాంకాలను ప్రొఫెసర్ సంజయ్ కుమార్ ఆగస్టు 17, 2025న సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఓటర్ల సంఖ్య పెరుగుదల, తగ్గుదలను గణించడంలో తప్పులు జరిగాయి. ఇది గ్రహించిన ప్రొఫెసర్ సంజయ్ 48 గంటలలోనే జరిగిన తప్పుకు క్షమాపణ చెప్పి, సోషల్ మీడియా నుంచి ఆ గణాంకాల పోస్ట్‌ను తొలగించారు వాటి గురించి ఆయన ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు, వ్యంగ్య విమర్శలు చేయలేదు. చాలా సౌమ్య రీతిలో ఆ సమాచారాన్ని వెల్లడించారు. అప్పటికే 'ఓట్ చోరీ'పై ప్రతిపక్షం చేస్తున్న ప్రచారాన్ని సమర్థించేదిగా ఆ సమాచారం లేదు. ఒక పరిశోధనా కార్యక్రమ సమాచారాన్ని సంస్థాగతంగా వెల్లడించడం కూడా కాదది. ఏది ఏమైనా ఆ గణాంకాలలో తప్పు దొర్లిన మాట వాస్తవం. అయితే అది ఏమంత ప్రాధాన్యమున్నది కాదు. తప్పును గ్రహించిన వెంటనే దాన్ని సరిదిద్దుకోవడం జరిగిందన్నది గమనార్హం. సీఎస్‌డీఎస్‌పై చర్యకు మరో కారణం కూడా అధికార వర్గాలకు లభించింది. ఇదీ ఏమంత ప్రాధాన్యమున్న సమస్య కానేకాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అమలుపై నిర్వహించిన ఒక ఒపీనియన్ పోల్ ఫలితాలను సీఎస్‌డీఎస్ ఇటీవల వెల్లడించింది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజల విశ్వాసం గణనీయంగా తగ్గిందన్నది ఆ సర్వే ఫలితాల సారాంశం. ఈ ఒపీనియన్ పోల్ వెల్లడించిన విషయాలలో విస్మయం కలిగించేవి ఏవీ లేవు. అయితే బీజేపీ శ్రేణులు ప్రొఫెసర్ సంజయ్ సోషల్ మీడియా పోస్ట్‌ను, ఈ ఒపీనియన్ పోల్ ఫలితాలను తెలివిగా కలగలిపి సీఎస్‌డీఎస్‌పై విమర్శలకు ఉపక్రమించాయి. ఆ పార్టీ ట్రోల్ ఆర్మీ రంగంలోకి దిగింది. అలాగే విధేయ మీడియా కూడా. సీఎస్‌డీఎస్‌కు గుణపాఠం చెప్పాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి.

ట్రోల్ ఆర్మీ విమర్శలు వెల్లువెత్తిన వెన్వెంటనే అధికారిక నేరారోపణ జరిగింది. సీఎస్‌డీఎస్ లాంటి సామాజిక శాస్త్ర పరిశోధనా సంస్థలు అన్నిటికీ ఆర్థిక సహాయమందించే భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి (ఐసీఎస్ఎస్ఆర్) రంగంలోకి దిగింది. 'సీఎస్‌డీఎస్ తన పరిశోధనా కార్యక్రమాల సమాచారాన్ని తారుమారు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, భారత ఎన్నికల సంఘం పవిత్రతకు కళంకం కలిగించే కథనాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని, ఇవి నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఐసీఎస్ఎస్ఆర్ సామాజిక మాధ్యమాలలో ఆరోపించింది. విచారణ ప్రారంభం కాక మునుపే తీర్పు వచ్చేసింది!

బుల్డోజర్ న్యాయంలో వలే లక్ష్యం ఎంపికయింది. శిక్ష ఖరారయింది. అందుకు కారణాన్ని కూడా నిర్ణయించారు. ముందుగానే తీసుకున్న నిర్ణయం అమలుకు రంగాన్ని సిద్ధం చేసేందుకు ఐసీఎస్ఎస్ఆర్ ఒక కమిటీని నియమించింది. ఐసీఎస్ఎస్ఆర్ ఆరోపణలకు కాకుండా సమస్త ఇతర విషయాలపై కమిటీ సీఎస్‌డీఎస్‌ను తప్పుపట్టి, దానిపై నేరారోపణ చేసినట్టు మీడియా వార్తలు వెల్లడించాయి. ప్రతిపాదిత శిక్ష, సమాచారాన్ని తారుమారు చేసినందుకు కాదు. సర్కారీ వ్యవస్థలో ఎవరినైనా చిక్కుల్లో పెట్టేందుకు ఉపయోగించుకునే విషయాలనే సీఎస్‌డీఎస్‌కు వ్యతిరేకంగా ఉపయోగించుకున్నారు: నియామకాల నిబంధనల ఉల్లంఘన, ఉద్యోగులకు జీతభత్యాల చెల్లింపు లేదా చెల్లించకపోవడం, సమావేశాలను సక్రమంగా నిర్వహించకపోవడం, నిర్వహించిన వివరాలను నమోదు చేయకపోవడం మొదలైనవి.

ఐసీఎస్ఎస్ఆర్ నియమించిన కమిటీ నివేదిక ఇంకా విడుదల కాలేదు. అయినప్పటికీ సీఎస్‌డీఎస్‌కు నిధుల మంజూరును ఐసీఎస్ఎస్ఆర్ వెన్వెంటనే నిలిపివేసింది. ఏడాది కాలంగా అధ్యాపకులకు వేతనాలు చెల్లించేందుకు ఆ సంస్థ నానా ప్రయాసలు పడుతోంది. వారిలో అత్యధికులు ఎన్నికల వ్యవహారాలపై పరిశోధన చేస్తున్నవారు కాదు. ఐసీఎస్ఎస్ఆర్ విధించిన శిక్షకు తీవ్ర బాధితులు బోధనేతర సిబ్బంది. పరిశోధనలతో ఎటువంటి సంబంధం లేని ఉద్యోగులు వారు. అనుషంగిక నష్టాలను, ప్రతికూల పరిణామాలను ఎవరు పట్టించుకుంటారు? సీఎస్‌డీఎస్ ప్రశస్త మేధా చరిత్ర నిలిచిపోనున్నదా?

# పరిశ్రమల 'సామాజిక బాధ్యత'తో అభివృద్ధి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, అభివృద్ధితో పాటు సీఎస్ఆర్ నిధుల రాక
- ఆ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
- పెనుకొండలో రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు
- కూటమి రాకతో రాష్ట్రంలో విస్తృతంగా పరిశ్రమల ఏర్పాటు
- పెట్టుబడుల రాకలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కీలక పాత్ర : మంత్రి సవిత
- కూటమి ప్రభుత్వం, కియా మధ్య ఒప్పందం
- రూ.12 కోట్లతో పెనుకొండలో ఐటీఐ కళాశాల భవన నిర్మాణం
- త్వరలో భూమి పూజ
- ఐటీఐ రాకతో కియాకు తీరనున్న నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత



**పెనుకొండ జూలై 30,అనంత జనశక్తి న్యూస్**

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, అభివృద్ధితో పాటు వాటి ద్వారా వచ్చే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల భవనాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. పెనుకొండ నియోజక వర్గంలో రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంగన్‌వాడీ, ఆసుపత్రు భవనాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో గురువారం కియా, కూటమి ప్రభుత్వం మధ్య రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణానికి ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి, ఉపాధి లభిస్తుందన్నారు. అదే సమయంలో ఆయా పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతగా స్థానికంగా ఉన్న గ్రామాల అభివృద్ధి సీఎస్ఆర్ నిధులు అందజేస్తాయన్నారు. ఈ నిధుల రాకతో గ్రామాల్లో రోడ్లు, సీసీ డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు వంటి నిర్మాణాలు చేపట్టే వీలు కలుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలొస్తున్నాయని మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు.

**రూ.12 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణం**

పెనుకొండలో కియా పరిశ్రమ ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. కియా కార్ల తయారీ పరిశ్రమకు నైపుణ్యం కలిగిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో పెనుకొండలో ఐటీఐ కళాశాల ఏర్పాటును మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన అంగీకరించారన్నారు. కియా పరిశ్రమతో మాట్లాడి రూ.12 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమీకరించామన్నారు. ఈ మేరకు కియా సంస్థ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం మధ్య ఎంవోయూ కుదిరిందన్నారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఐటీఐ కళాశాల భవనాన్ని వచ్చే విద్య సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని, త్వరలో ఈ భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల కల్పన**

పెనుకొండ నియోజక వర్గంలో రూ.36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. కియా, బెల్ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులు సమీకరిస్తున్నామన్నారు. ఇందులో పెద్ద మొత్తంలో కియా యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు అందిస్తోందన్నారు. ఈ నిధులతో రోడ్లు, సీసీ డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు వంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కియా పరిశ్రమ ఏర్పాటుతో ఏటా ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.3,600 కోట్లు ఆదాయం లభిస్తోందన్నారు. అనంతరం మంత్రి సవిత సమక్షంలో జరిగిన ఒప్పందంలో కియా సీఈవో తెహాన్ కిమ్, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కియా సీనియర్ అడ్వైజర్ జంగ్ హో, లైజనింగ్ ఆఫీసర్ సోమశేఖర్ రెడ్డి, ఆర్డీవో ఆనంద కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 220కోట్లతో రోడ్లు, 100కోట్లతో మంచి నీరు అందించాం



- రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి ఇది.. ఎమ్మెల్యే పరిటాల సునీత
- రాప్తాడు అభివృద్ధి, సంక్షేమ విజయాల పాంప్లెట్ ను ఆవిష్కరణ
- ప్రతి ఇంటికి మనం చేసిన వాటిని తీసుకెళ్లాలన్న సునీత
- ఎమ్మెల్యే సునీతతో ధర్మవరం డీఎస్పీ మర్యాదపూర్వక భేటి

**రాప్తాడు జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

రెండేళ్లలో నియోజకవర్గంలో రూ.220కోట్లతో రోడ్లు, 100కోట్లతో గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందిస్తున్నామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలో రెండేళ్ల అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధికి సంబంధించి ఒక ప్రచార నివేదికను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఎమ్మెల్యే సునీత తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజ కవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. 220కోట్లతో వివిధ పథకాల కింద రోడ్లు, వంతెనలు, 1000 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం గల రామగిరి సోలార్ ప్లాంట్, గొందిరెడ్డిపల్లి, దాదులూరులో 109కోట్ల పెట్టుబడితో 6వేల మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ పార్క్, నసనకోట ఎంజేపీ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్, జీడిపల్లి రిజర్వాయర్ నుండి పరిటాల రవీంద్ర సాయనీ కాలువకు 810కోట్ల కేటాయింపు, జల జీవన్ మిషన్ ద్వారా 100కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు, జాకీస్థానంలో రూ.330కోట్లతో రేమాండ్స్ కంపెనీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. మహిళా సంఘాలకు 516 కోట్లు రుణాలు, 41,315మందికి 136కోట్లతో పింఛన్లు, 83917మంది పిల్లలకు 110కోట్లతో తల్లికి వందనం, 1167మందికి ఆటోడ్రైవర్లకు 2.5కోట్లు, 727గోకులం షెడ్లు 9.80కోట్లు, రూ.10.50కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 7కోట్లతో ఆరోగ్య కేంద్రాలు, 41077కోట్లతో విద్యార్థులకు కిట్లు, 17కోట్లతో పాఠశాలల అభివృద్ధి, 36కోట్లతో సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, పాఠశాల భవనాల అభివృద్ధికి 17కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణుల పై ఉందన్నారు. ఈ 40రోజులు ప్రతి ఇంటికీ మనం వెళ్లాలని.. చేసిన వాటి గురించి ప్రతి ఒక్కరికి వివరించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు...

**శాంత్రి భద్రతల పరిరక్షణకు తొలి ప్రధాన్యత ఇవ్వండి.. ఎమ్మెల్యే సునీత**



ధర్మవరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథరాజు ఎమ్మెల్యే పరిటాల సునీతతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతను కలిశారు. ధర్మవరం సబ్ డివిజన్ లోని రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిస్థితుల గురించి చర్చించారు.

గతంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం ఉన్న వాటి గురించి చర్చించారు. నియోజకవర్గంలో తమకు ప్రశాంత వాతావరణం ఉండటమే ముఖ్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. ఈ విషయంలో పార్టీలు కూడా చూడాల్సిన అవసరం లేదని.. తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు...

# వైసీపీకి రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి తప్పదు



- వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవు.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- 37మందికి రూ.49.69లక్షల పంపిణీ చేసిన ఎమ్మెల్యే
- రెండేళ్లలో 692మందికి రూ.6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ సాయం
- ఐదేళ్లలో మీరు ఎంత సాయం చేశారో చెప్పాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

వైసీపీ నాయకులు రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కొంటారని.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 33వ విడుతలో 37మందికి రూ.49.69లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ నాయకులు, లబ్ధిదారులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 692మందికి రూ.6.90కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామన్నారు. గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ ఎంత మందికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేశారో చెప్పాలన్నారు. 692మందిలో 450 మంది ముస్లిం మైనార్టీలు ఉన్నారని.. మైనార్టీల పట్ల మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం ఇది అని అన్నారు. వైసీపీ నాయకులకు ప్రజలకు అధికారం ఇస్తే ఎలాంటి కార్యక్రమాలు చేయరని.. మేము చేస్తామంటే చూసి ఓర్వలేరన్నారు. నిత్యం ఏదో ఒక వివాదం సృష్టిస్తున్నారని.. ప్రజలు వారిని చూసి అసహ్యించుకుంటున్నారన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో రూ.3500కోట్లు మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని.. ఇందులో రోజుకి ఒకరి పేరు వెలుగులోకి వస్తోందన్నారు. వరుసగా జైలు బాట పడుతున్నారన్నారు. వారు ఇలాగే కుట్రలు, కుతంత్రాలు చేస్తే మరింత పతనమవుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి వినతి



- హరీష్ బాబును కలిసిన ఆలయ కమిటీ సభ్యులు...

**ధర్మవరం జులై 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణం 9వ వార్డు లింగశెట్టి పాళ్యం వీధిలోని శ్రీ త్రిలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఆలయంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు గురువారం ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన హరీష్ బాబు ఆలయ కమిటీ సభ్యులు వివరించిన సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకునేలా చూడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు తమ వినతి పై సానుకూలంగా స్పందించిన హరీష్ బాబు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభం కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## అర్హు లైన లబ్ధిదారులకు త్వరలోనే పింఛను మంజూరు చేస్తాం



- ఎమ్మెల్యే అమిలినేని
- వాల్మీకి విగ్రహానికి పైన స్లాబ్ వేసేందుకు 1,00,000 అందజేత
- అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు 10,000 ఆర్థిక సాయం అందజేత
- నాలుగవ రోజు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో వడ్డేపాల్యం గ్రామంలో స్వయంగా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

**కుందుర్పి జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

వైసీపీ ప్రభుత్వంలో రకరకాల కారణాలు చెప్పి ఎంతో మంది నిరుపేద వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు తొలగించి వారి పొట్ట కొట్టారని కూటమి ప్రభుత్వంలో త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించి వారికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు కుందుర్పి మండలం వడ్డేపాల్యం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మండల గ్రామ స్థాయి నాయకులతో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు..ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కి గ్రామస్థులు, నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలుకగా ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య పాలన, కనీసం గ్రామాల్లో సరైన మౌలిక వసతుల కల్పనపై కూడా ద్రుష్టి పెట్టకుండా సమస్యలను పెంచి వెళ్లారని ఇప్పుడు వాటిని అదిగమించి గ్రామీణ రహదారులతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులైన విద్యుత్, తాగునీరు, సీసీ రహదారులు నిర్మించి ప్రజల సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు.గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పైకప్పు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా వెంటనే తన స్వంత నిధులతో పూర్తి చేస్తామని అందుకు పనులు ప్రారంభించేందుకు గాను 1,00,000 రూపాయలు గ్రామస్థులు అందించారు..గ్రామంలో నాగమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి వెంటనే వైద్యులతో మాట్లాడి మరింత మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఖర్చుల కోసం 10,000 రూపాయలు అందించారు..గ్రామానికి చెందిన మారెక్క, యశోదమ్మలకు వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ తొలగించారని తెలుసుకుని త్వరలో తప్పకుండా పింఛన్ మంజూరు చేస్తామని వారికీ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి 5,000 రూపాయల చొప్పున అందజేశారు..ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కాంపౌండ్ నందు సీసీ, టాయిలెట్లు అవసరం ఉందని అడగ్గా తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు..

## ఎక్సైడ్ బ్యాటరీని విరాళంగా అందచేసిన విజయభాస్కర్

**యాడికి, జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాస్పత్రి లో గురువారం ఆస్పత్రి కి ఎక్సైడ్ బ్యాటరీని విరాళంగా రిటైర్మెంట్ ప్రధానోపాధ్యాయుడు కె.విజయభాస్కర్ వైద్య సిబ్బంది కి అందచేశారు.రోగుల సౌకర్యార్థము కోసం బ్యాటరీని వినియోగించాలని తెలిపారు. దీంతో వైద్య సిబ్బంది రిటైర్మెంట్ ప్రధానోపాధ్యాయుడు కె.విజయభాస్కర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పరమేష్ , శ్రీరాం,ఎం ఆర్ పి గౌడ్ ,ఎం ఎన్ ఎం మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ సిబ్బంది పిల్లలకు 'తల్లికి వందనం'.. కదిరిలో హర్షాతిరేకం




- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

**కదిరి, జూలై 30:అనంత జనశక్తి న్యూస్**

అంగన్వాడీ సిబ్బంది పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో అంగన్వాడీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు తరలివచ్చి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ, తమ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో తమ సమస్యలు పట్టించుకోలేదని, ప్రస్తుతం తమ కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషాన్ని కలిగించిందన్నారు.అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, అంగన్వాడీ సిబ్బంది అడగకముందే వారి పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాల పెంపు కోరిన అంగన్వాడీ కార్యకర్తలపై లాఠీచార్జ్ జరిగిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పలు సంక్షేమ నిర్ణయాలు అమలు చేస్తోందని తెలిపారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం..



- భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు, రాజకీయ ప్రతినిధులతో సమావేశం.
- ధర్మవరం నియోజకవర్గ తాసిల్దార్లు.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జులై 30, అనంత జనశక్తి న్యూస్:**

భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి, శ్రీ సత్యసాయి జిల్లా వారి సూచనల మేరకు నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా, 160 ధర్మవరం శాసనసభ నియోజకవర్గానికి చెందిన గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ కార్యాలయంలో సహాయ ఓటరు నమోదు అధికారులు సమావేశం నిర్వహించామని నియోజకవర్గంలోని ధర్మవరం తాసిల్దార్ దేవరాజ్, తాడిమర్రి తాసిల్దార్ రెడ్డి లక్ష్మి ,ముదిగుబ్బ డిప్యూటీ తాసిల్దార్ నారాయణస్వామి, బత్తలపల్లి తాసిల్దార్ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ఉమామహేశ్వరరావు ,ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ ఈశ్వరయ్య లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

ఎస్ ఐ ఆర్ 2026 కార్యక్రమం జులై 24 వ తేదీతో 100 శాతం డిజిటలైజేషన్‌తో విజయవంతంగా పూర్తిచేయడంలో సహకరించిన అన్ని రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు ఏ ఈ ఆర్ వో లు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి అర్హత గల ఓటరు గణన పత్రాలను సమర్పించడం, రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడం వల్ల కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని వారు పేర్కొన్నారు.అలాగే, మరణించిన ఓటర్లు, శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు, డూప్లికేట్ నమోదులు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను గుర్తించడంలో రాజకీయ పార్టీలు అందించిన సహకారం వల్ల ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందిందని తెలిపారు.ధర్మవరం శాసనసభ నియోజకవర్గంలో గణన పత్రాలు అందని ఓటర్ల వివరాలు తెలుపుతూ మరణించిన ఓటర్లు - 6,098,శాశ్వతంగా నివాసం మార్చుకున్నవారు - 6,295,

డూప్లికేట్ నమోదులు - 4,999

గైర్హాజరైన ఓటర్లు - 2,513,ఇతరులు - 40,మొత్తం గణన పత్రాలు అందని ఓటర్లు - 19,945 కలదని తెలిపారు.

భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ముసాయిదా ఓటరు జాబితాపై దరఖాస్తులు, అభ్యంతరాలు, సూచనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ నిర్మాణాత్మక సహకారాన్ని కొనసాగించాలని ఏ ఈ ఆర్ వో లను కోరారు. అనంతరం

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఎస్ ఐ ఆర్-2026 కార్యక్రమంపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాయిబాబా కు ప్రత్యేక పూజలు

**యాడికి, జూలై 30,అనంత జనశక్తి న్యూస్**



**మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయంలో గురువారం సాయిబాబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి,హారతు లను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ను దర్శించి,టెంకాయలను సమర్పించారు. భక్తుల కు తీర్థ ప్రసాదాల ను అందచేశారు. సాయం త్రం భజన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని పల్లకి లో ఉంచి,సాయినాథ్ మహారాజ్ కు జై అంటూ...... దేవాలయం చుట్టు ప్రదక్షిణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు,భక్తులు పాల్గోన్నారు.**

# మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడితే మూల్యం చెల్లించుకుంటారు

- వైసీపీకి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక
- 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో ఇంటింటికి కూటమి ప్రభుత్వం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తో కలిసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే
- డీఎస్సీ గురించి ఏడాదిన్నర తర్వాత గుర్తొంచిందా అని నిలదీసిన దగ్గుపాటి

**అనంతపురం జూలై 30,అనంత జనశక్తి న్యూస్**



విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురించి ఆధారాలు లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారని వైసీపీ నాయకులకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. 47వ డివిజన్ రంగస్వామి నగర్ లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు ఎంత మేర వచ్చాయన్నది ఆరా తీశారు. కొందరి ఇళ్లలో ముగ్గురు పిల్లలు ఉన్నా.. తల్లికి వందనం అందిందని సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే నగరంలో జరిగిన అభివృద్ధిపై కూడా సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. ఈ రెండేళ్లలోనే రూ.1290కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామన్నారు. గత ఐదేళ్లలో ఎక్కడైనా ఇలా పనులు చేశారా అని నిలదీశారు. పిచ్చి తుగ్లక్ పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేస్తే.. సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారన్నారు. సీబీఎన్ బ్రాండ్ తో మంత్రి నారా లోకేష్ 25లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని.. ఒక్క రాయలసీమ లోనే లక్ష కోట్లు హార్టీకల్చర్ హబ్ కు కేటాయించేలా ప్రణాళికలు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. పుట్టపర్తిలో 5వ జనరేషన్ కు సంబంధించిన యుద్ధవిమానాలు తయారు చేసే పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. ఇది ఉమ్మడి జిల్లాకే గర్వకారణమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తే.. ఏడాదిన్నర తర్వాత దీనిపై ఏదో జరిగిందని డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారని వైసీపీ పై విమర్శలు గుప్పించారు. ఒక అబద్ధాన్ని పదే పదే నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ బహిరంగ సవాల్ కు రమ్మంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదన్నారు. కేవలం మెగా డీఎస్సీ మాత్రమే కాకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చారన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి చేరేలా బదుల్ని మార్చారన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపులు, టాయిలెట్స్ వద్ద ఉంచి అవమానించారన్నారు. అదే ఈ రోజు ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పిస్తూ.. ప్రతి నెల 1వతేదిన వేతనాలు అందజేస్తున్నారన్నారు. నాడునేడు పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చేస్తున్న రద్ధాంతాన్ని ఇప్పటికైనా మానుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ దలవాయి రమాదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, కాశీ విశ్వేశ్వర దేవాలయ ఆలయ చైర్మన్ నరేంద్ర చౌదరి, టిడిపి మాజీ నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బోయపాటి బాలప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి, క్లస్టర్లు ఇంచార్జ్ లు సరిపూటి రమణ, వన్నురప్ప, గోపాల్ గౌడ్, టిడిపి నాయకులు సరళ, చరిత, వడ్డే భవాని, దాడి శ్రీనివాస్ చౌదరి, మున్వర్, నల్లాని మనోహర్, ఓంకార్ రెడ్డి, వసుంధర, సుజాతమ్మ, అయేషా నేహా, కదిరప్ప, వెంకట సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం ప్రారంభోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేయాలి

- ప్రతి అంశాన్ని రెండుసార్లు పరిశీలించండి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**భోగాపురం, జూలై 30,అనంత జనశక్తి న్యూస్**



ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రులు ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సంబంధించి నిమిషానికో కార్యక్రమం చొప్పున రూపొందించిన కార్యాచరణను ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ముఖ్యమంత్రికి వివరించారు. అతిథుల రాకపోకలు, పార్కింగ్, భద్రత, తాగునీరు, రవాణా, మీడియా, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతి ఏర్పాటును ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం మూడు వేలకుపైగా కార్లకు సరిపడే పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రికి వివరించారు.రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చే ప్రజల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సుల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు అవసరమైతే వినియోగించేందుకు రిజర్వ్ పార్కింగ్ స్థలాలను కూడా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. థింసా నృత్య ప్రదర్శన ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ వివరించారు. సమాచార, పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ మీడియా ఏర్పాట్లపై వివరించగా, డీఐజీ గోపీనాథ్ జెట్టి భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ నిర్వహణపై ముఖ్యమంత్రికి వివరించారు.సమీక్షలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాసరావు, గుమ్మడి సంధ్యారాణి, కందుల దుర్గేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీలు జె. శ్యామలరావు, వీరపాండ్యన్, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, అశోక్ మయూర్, వివిధ బోర్డుల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సేవ చేసే భాగ్యం నా అదృష్టం

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు
- ఎస్సార్సీ ట్రస్ట్ సహకారంతో రూ.5 కోట్ల వ్యయంతో 7,300 సైకిళ్ల పంపిణీ – మూడో రోజు కార్యక్రమంలో గ్రామీణ విద్యార్థులకు కానుక

**కుందుర్పి, జూలై 30:అనంత జనశక్తి న్యూస్**




గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఎస్సార్సీ ట్రస్ట్ సహకారంతో రూ.5 కోట్ల వ్యయంతో 7,300 సైకిళ్ల పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు.కుందుర్పి మండలం మాలయనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో రోజు నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో సైకిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారులు పుస్తకాల బ్యాగులు మోసుకుంటూ ఎంతో దూరం నడిచి పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలు చూసి బాధ కలిగిందని, అప్పుడే వారికి ఉపయోగపడేలా సైకిళ్లు అందించాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. విద్యార్థులకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.గత ప్రభుత్వం "అమ్మఒడి" పేరుతో ప్రతి ఇంటికి పథకం అందిస్తామని చెప్పి, చివరకు ఒక్క ఇంట్లో ఒక్కరికే పరిమితం చేసిందని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఒక ఇంట్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు ఎంతమంది విద్యార్థులు చదువుతున్నా అందరికీ "తల్లికి వందనం" పథకం వర్తింపజేసి రూ.10,190 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం అమ్మఒడి కోసం రూ.5,500 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, ప్రస్తుతం 30 వేల మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు కూడా తల్లికి వందనం వర్తింపజేయడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ ద్వారా నాణ్యమైన దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందజేస్తోందని చెప్పారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, స్థానిక నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చంద్రబాబుది అభివృద్ధి విజన్.. జగన్‌ది అబద్ధాల విజన్

- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ప్రజలతో మమేకం.. బొంతలపల్లి పాఠశాల సందర్శన

**పుట్టపర్తి, జూలై 30:అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ప్రజలకు నమ్మకం, అభివృద్ధి, సంక్షేమాన్ని అందించగా, గత వైసీపీ పాలనలో విధ్వంసం, అరాచకం, అబద్ధ ప్రచారాలే కనిపించాయని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. గురువారం పుట్టపర్తి నియోజకవర్గంలోని బొంతలపల్లి, కంబాలపర్తి గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు వస్తున్నాయని,పోలవరం ప్రాజెక్టు పూర్తి, అమరావతి అభివృద్ధి, ఉపాధ్యాయ నియామకాలు వంటి కీలక కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే భూహక్కుల చట్టాన్ని తీసుకువచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేసి రైతుల హక్కులను కాపాడిందన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, రైతులకు అధిక సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.2,202.07 కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, భారీ పారిశ్రామిక పెట్టుబడులు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అలాగే 193 చెరువులు, రెండు రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు కృష్ణా జలాలను అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

**పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే**

**ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బొంతలపల్లి ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి, తరగతి గదిలో కొద్దిసేపు పాఠాలు బోధించి వారిని ప్రోత్సహించారు.తర్వాత పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో చింత శ్రీనివాసులు దినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.**





# ఇంటింట ప్రచారం హోరు...
# రాష్ట్రంలో ఐదో స్థానంలో జోరు

- ఇంటింటా ప్రచారంలో రాష్ట్రంలోనే 5వ స్థానంలో ధర్మవరం
- మరింత చురుగ్గా పాల్గొనాలన్న టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్
- 25వ వార్డు ప్రియాంక నగర్ లో ఇంటింటా ప్రచారంలో శ్రీరామ్
- డీఎస్సీపై నారా లోకేష్ ఛాలెంజ్ ని స్వీకరించే ధైర్యం ఉందా..?
- అలా ఉంటేనే మాట్లాడాలని వైసీపీ నాయకులకు శ్రీరామ్ కౌంటర్

**ధర్మవరం జులై 30, అనంత జనశక్తి న్యూస్:**

రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ధర్మవరం ని యోజకవర్గం రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచింది. ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వ ర్యంలో క్యాడర్ గడిచిన 4రోజుల పాటు విస్తృతంగా జనంలోకి వెళ్లారు. ఇంటింటా తిరుగుతూ కూటమి పాలనలో జరిగిన మంచిని వివరించారు. గురువారం 25వ వార్డులోని ప్రియాంక నగర్ లో జరిగిన కార్యక్ర మంలో శ్రీరామ్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. కొన్ని చోట్ల తమకు అన్ని పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల కొన్ని సమస్యల్ని శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే.. వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ని యోజకవర్గంలో 80వేల 726ఇళ్లు ఉండగా.. మూడు రోజులకు 15వేల 965ఇళ్లకు టీడీపీ శ్రేణులు వెళ్లా రన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మరింత చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కేవలం చేసిన మంచి గురించి చెప్పడమే కాకుండా ప్రజల సమస్య లను కూడా తెలుసుకోవాలన్నారు. మరోవైపు మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ హాయంలో టీచర్ పోస్టులు భర్తీ చేయమంటే కాలయాపన చేసి.. ఇప్పుడు రికార్డ్ టైం మెగా డీఎస్సీని పూర్తి చేస్తే ఏడా దిన్నర తర్వాత అక్రమాలంటూ వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడమేంటని నిలదీశారు. ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని.. దీనిని నిరూపిం చేందుకు ఎక్కడికైనా వస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరితే వైసీపీ నాయకులు ఎందుకు స్వీకరించడం లేదన్నారు. కేవలం ఆరోప ణలు చేసి బురదజల్లుతామంటూ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని శ్రీరామ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏపీ సీడ్స్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిశే సుధాకర్, మైనార్టీ నాయకులు నాగూర్ హుస్సేన్, పురుషోత్తం గౌడ్, టిడిపి యువ నాయకులు సంధా రాఘవ, జింకా పురుషోత్తం, రాళ్ల పల్లి బాబు, ఫణి కుమార్, బొట్టు కిష్ట, జింకల రాజన్న, అడ్ర మహేష్, 40 వ వార్డ్ ఇంచార్జ్ అశోక్, వంట రమేష్, రాయపాటి శివ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారిస్తున్న మంత్రి నారా లోకేష్

- ఎమ్మెల్యే కాలవ.
- పత్తికొండలో 400 మెగావాట్ల రాయదుర్గం గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖమంత్రి నారా లోకేష్.

**రాయదుర్గం జూలై 30, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను తీసుకువస్తూ పా రిశ్రామిక ప్రగతికి యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ బాబు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.పత్తికొండ పర్యటన సం దర్భంగా రాయదుర్గంలో ఏర్పాటు కానున్న 400 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేష్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ...రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ అభివృ ద్ధి శరవేగంగా కొనసాగుతోందన్నారు. రాబోయే ఐదేళ్లలో దేశంలో 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యం తో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇదే నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను 150 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో దేశంలోనే గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి ఫలితంగా రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా పురోగమిస్తోందన్నారు. ఒకప్పుడు రాయలసీమ ప్రాంతం వెనుకబడిన ప్రాంతంగా చెప్పుకునే పరి స్థితి ఉండేదన్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాయదుర్గం ఉరవకొండ గుంతకల్లు పత్తికొండ ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలు తీవ్ర దుర్భిషంతో సతమతమయ్యేవన్నారు. తీవ్రమైన తాగునీటి కొరతతో ఉపాధి అవకాశాలు లేక వలసలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. నేడు ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సీమలో పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నా యన్నారు. అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమ ఏర్పాటు చేసి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని పేర్కొన్నారు.అదే విధంగా పుట్టపర్తిలో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఫైటర్ జెట్ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన జరగడం అభినందనీయమన్నారు.అదేవిధంగా గ్రీన్ ఎనర్జీ రంగాన్ని విస్తృత చేస్తూ వేల మెగావాట్ల సామర్థ్యం గలిగిన ప్రాజెక్టులను తీసుకురావడం జరుగుతోందన్నారు.రాయదుర్గం నియోజకవర్గం లో నేడు 400 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర విద్యుత్ కొరత ఉండేదని ఎమ్మె ల్యే గుర్తు చేశారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనా అనుభవం, నైపుణ్యంతో అతి తక్కువ కాలంలోనే విద్యుత్ కొరతను అధిగమించి రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను తీసుకు రావడంలో నారా లోకేష్ తనదైన ముద్ర వేస్తున్నారని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 27శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేలా రాష్ట్ర ప్రభు త్వం పారిశ్రామిక అనుకూల విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. మంత్రి లోకేష్ అతి చిన్న వయ సులోనే సుమారు 3,000 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి రాష్ట్రంలోని ప్రజలను, ప్రతి ప్రాంతాన్ని స్వయంగా సందర్శించారన్నారు.

పాదయాత్రలో ప్రజల సమస్యలు, వారి అవసరాలు, స్థానిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నా రు. ఏ ప్రాంతానికి ఎలాంటి అభివృద్ధి అవసరమో గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం స్పష్టమైన దార్శనికతతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వకా రణమన్నారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తమ సంపూర్ణ సహకారం, ఆశీ ర్వాదాలు ఎల్లప్పుడూ అందించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు.

# ఉత్తరాంధ్రకు మకుటాయమానం..
# భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

- మంత్రి కందుల దుర్గేష్

**భోగాపురం,విజయనగరం**

**జూలై 30, అనంత జనశక్తి న్యూస్**




ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జా తీయ విమానాశ్రయం ఈ ప్రాంత రాజకీయ, ఆర్థిక, పర్యాటక వృద్ధికి ప్రధాన చిరునామాగా మారనుంద ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ వి మానాశ్రయం" ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయన సహచర మంత్రులతో, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ లోపల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కట్టడాలు, కళాకృతులను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తి లకించగా సంబంధిత వివరాలను సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు వివరించారు. అనంతరం టెర్మినల్ భవనంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృ తిక వైభవం ప్రస్ఫుటించేలా చేసిన ఏర్పాట్లను మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..అభివృద్ధికి రెక్కలు వచ్చినట్లుగా, ఉత్తరాంధ్రకు గ్లోబల్ లుక్ వచ్చేలా దర్శ నమిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణలు, కూచిపూడి నృత్య భంగిమలు, ఏటికొ ప్పాక బొమ్మలు, తోలుబొమ్మలాట చిత్రాలు, కలంకారీ పెయింటింగ్స్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి అద్దంపట్టేలా ఉంటూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, తిరుమల, లేపాక్షి నంది వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, మన్యం అందాలను చాటిచెప్పే డిజిటల్ స్క్రీన్‌లు, వాల్ పెయింటింగ్స్‌తో ఆంధ్రా వైభవం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉందని అభినందించారు. 'ఫ్లైయింగ్ ఫిష్' ఆకారంలో రూ పొందించిన టెర్మినల్ డిజైన్, విద్యుద్దీపాలంకరణతో అత్యంత సుందరంగా ఉందన్నారు. అంతేగాక ఎయి ర్‌పోర్టులోని ఏరో బ్రిడ్జ్, ఏరో ట్రాఫిక్ కంట్రోల్ టవర్, రన్‌వే, టాక్సీవేలు, ఏప్రాన్ ప్రాంతాలు, అప్రోచ్ రోడ్లను మంత్రి దుర్గేష్ నిశితంగా పరిశీలించారు. హైస్పీడ్ సెక్యూరిటీ స్కానింగ్, ఫాస్ట్ డిజిటల్ చెక్‌ఇన్, సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ ఇగేట్స్, విశాలమైన పార్కింగ్ స్థలాలు, ఎస్క్ లేటర్లు, ఎలివేటర్లు వంటి ఆధునిక వసతులు ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభూతిని అందిస్తాయని తెలిపారు. ఎయిర్‌పోర్ట్ నమూనాను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలు సుకున్నారు. విశాఖ రైల్వే జోన్‌తో పాటు భోగాపురం ఎయిర్‌పోర్టు ద్వారా కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెద్దపీట వేసిందని మంత్రి తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల ఈ ప్రాంతానికి పెద్ద ఎత్తున పరి శ్రమలు, పెట్టుబడులు తరలివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.పర్యాటకం, విమానయాన, పారిశ్రా మిక రంగాలలో విపరీతమైన అవకాశాలు పెరుగుతా యని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర భవిష్యత్తును మార్చే గేమ్ చేంజర్ ఈ ఎయిర్ పోర్ట్ అని చెబుతూ.. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో ఇది కీలక భూమిక పోషిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు గ్లోబల్ ఇమేజ్ తీసుకొస్తుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహిం చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని.. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాని పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న 'థింసా' నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుం దని వెల్లడించారు. ఆగస్టు 1న జరగనున్న ఈ చారిత్రా త్మక ఘట్టంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో
# న్యాయ అవగాహన కార్యక్రమం

**సత్తెనపల్లి జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు, సత్తెనపల్లి న్యాయ సేవాధికార మండల కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి సూచనలతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు - ప్రగతి జూనియర్ & డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి పెను ముప్పుగా మారిందన్నారు.కొందరు ముఠాలుగా ఏర్పడి మహిళలు, చిన్నారులు, నిరుపేదలను మోసం చేసి అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా, వారిని బలవంతంగా భిక్షాటన చేయిస్తూ అక్రమంగా లాభాలు పొందుతున్నారని వివరించారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు ఎంతో విలువైనదని,విదేశాల్లో ఉద్యోగాలు, అధిక వేతనాలు, సినిమా, సెలెబ్రేటీ, స్పోర్ట్స్ వకాశాలు,ఇప్పిస్తామంటూ,ప్రముఖులుగా తీర్చిదిద్దుతామని వచ్చే మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఉద్యోగాలు, విద్యా అవకాశాల పేరుతో వచ్చే ప్రతి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ఇటువంటి నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కోటగిరి లక్ష్మణ్, గుర్రం పవన్, తెనాలి నవజ్యోతి బాబు, కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, అట్లూరి జ్యోతి, అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి దేవాలయం లో ముగిసిన నామ సప్తాహము

**యాడికి, జూలై 30 అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాల యంలో గురువారం తో నామ సప్తాహము కార్యక్ర మం ఘనంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు శ్రీ అయ్యప్పస్వామి కి పంచామృత అభిషేకం చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు.అర్చ నలు చేసి, మహా మంగళ హారతులు సమర్పించారు. 9 గంటలకు క్షీరతర్పణం కార్యక్రమం నిర్వహించా రు.9:35 నిమిషములకు నామస్మరణ ముగింపు కార్యక్రమం చేశారు.9:40 నిమిషములకు విశేష హారతులు సమర్పిం చారు.భక్తలు అధిక సంఖ్యలో పాల్గొని, అయ్యప్పస్వామి ని దర్శించి, టెంకాయలను కానుకలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేసి, అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాను అరికట్టాలి!!




- ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు.
- మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలి.
- న్యాయవాదులు.

**ధర్మవరం జులై 30, అనంత జనశక్తి న్యూస్:**

మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని న్యాయవాదులు బా లసుందరి, బాబా, నరసింహమూర్తి, శంకరయ్యలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల లీగల్ సర్వీసెస్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, పురుషులు, పిల్లలతో సహా మిలియన్ల మంది మానవ అక్రమ రవాణాకు బాధితులు అవుతున్నారని ఇలాంటి వాటికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మానవ అక్రమ రవాణా గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలను చైతన్య పరచడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాలో బీజేపీ సంస్థాగత సమావేశం..



- స్థానిక ఎన్నికలకు శ్రేణులకు దిశానిర్దేశం
- బూత్ కమిటీల బలోపేతం, ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక శిక్షణ

**అనంతగిరి జూలై 30 ,అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండల కేంద్రంలోని పద్మాపురం ఉషోదయ రిసా ర్ట్‌లో గురువారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అరకు అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల్లో విజయం సాధించా లంటే బూత్ స్థాయి కమిటీల బలోపేతం అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ పరిధిలో సంస్థాగత మార్పులు, బీఎల్ఏ 2 వ్యవస్థ నిర్మాణం, బూత్ స్థాయి కార్యకలాపాలపై కార్యకర్తలు, నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు ఫారం 6 ద్వారా కొత్తగా 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయడం, ఫారం 7 ద్వారా నకిలీ, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించడం, ఫారం 8 ద్వారా ఓటరు వివరాల్లోని తప్పులు, చిరునామా మార్పులను సరిచేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.ప్రతి బూత్ ఏజెంట్ స్థానిక ఓటర్లతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ పార్టీని స్థానిక ఎన్నికలకు సమాయత్తం చేయాలని నాయకులు సూచించారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఇంచార్జి పుట్ట గంగయ్య, జిల్లా అధ్యక్షురాలు మట్టం సంతకుమారి, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు పాంగీ రాజారావు, సెంట్రల్ కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే మండల అధ్యక్షుడు అద్దాల సోమరాజు, ఎంపీటీసీ వంతల తమన్న, మండల ప్రధాన కార్యదర్శి శిరగం రామకృష్ణతో పాటు నియోజకవర్గ పరిధిలోని పార్టీ పదాధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పంట బీమాకు నేడే చివరి తేదీ.

- రైతులు పంటల భీమా తప్పనిసరిగా చేసుకోవాలి

**అగళి జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

అగలి మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఖరీఫ్ 2026 భీమా ను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎకరాకు మొక్కజొన్నకు రూ.165,కందులకు రూ. 102,రాగి,ఆముదానికి రూ.80 ఈ జూలై 31వ తారీకు లోపు చెల్లించి, ఇన్సూరెన్స్ చేసుకోవాలని చెప్పడం జరిగింది.అలాగే పునర్వ్య వస్థికరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఖరీఫ్ 2026 కింద వేరుశనగకు ఎకరాకు రూ.640 ,పత్తికి రూ 1900 , బత్తాయి రూ. 2750 రూపాయలు, దానిమ్మకు రూ. 3750 , టమోటాకు రూ.1600 , చొప్పున ఈ జూలై 31 తారీకు లోపు * చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిందిగా కో రడమైనది,ఇందులో భాగంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు ఒకసారి బ్యాంకులకు వెళ్లి ఇన్సూరెన్స్ అయిందో లేదో చెక్ చేసుకోవాలి, మీరు ఏ పంట అయితే వేసి ఉంటారో అదే పంటకు రుణాలు తీసుకొని ఇన్సూరెన్స్ చేసి ఉండాలి,చెక్ చేసుకొని పంటలలో ఏమైనా మార్పులు ఉంటే చెక్ చేసుకోవాలి అదే విధంగా రుణాలు తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా గాని మీ సేవలో కానీ వాళ్ళ ఆధార్ కార్డు,భూమి పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రం తీసుకొని సెల్ఫ్ డెకరేషన్ ఇచ్చి వాళ్లు పండించే పైన తెలిపిన పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిం దిగా అగళి మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు తెలియజేసారు.

## శ్రీ వైష్ణవి విద్యాసంస్థల్లో న్యాయ అవగాహన కార్యక్రమం



సత్తెనపల్లి జూలై 30, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు, సత్తెనపల్లి న్యాయ సేవాధికార మండల కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్ కుమార్ రెడ్డి సూచనలతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు ప్రగతి జూనియర్ & డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి పెను ముప్పుగా మారిందన్నారు.కొందరు ముఠాలుగా ఏర్పడి మహిళలు, చిన్నారులు, నిరుపేదలను మోసం చేసి అక్రమ రవాణాకు పాల్పడటమే కాకుండా, వారిని బలవంతంగా భిక్షాటన చేయిస్తూ అక్రమంగా లాభాలు పొందుతున్నారని వివరించారు. ఇలాంటి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు ఎంతో విలువైనదని,విదేశాల్లో ఉద్యోగాలు, అధిక వేతనాలు, సినిమా, సెలెబ్రేటీ, స్పోర్ట్స్ అవకాశాలు,ఇప్పిస్తామంటూ,ప్రముఖులుగా తీర్చిదిద్దుతామని వచ్చే మోసపూరిత ప్రకటనలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఉద్యోగాలు, విద్యా అవకాశాల పేరుతో వచ్చే ప్రతి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.మానవ అక్రమ రవాణా వంటి నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ఇటువంటి నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కోటగిరి లక్ష్మణ్, గుర్రం పవన్, తెనాలి నవజ్యోతి బాబు, కళాశాల డైరెక్టర్ బ్రహ్మారెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, అట్లూరి జ్యోతి, అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరుల చలో కలెక్టరేట్




- 396 జీవోను రద్దు చేయాలి.
- శ్రీ సత్య సాయి జిల్లా దస్తావేజు లేఖలు.

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, జూలై 30, అనంత జనశక్తి న్యూస్:

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు గురువారం పుట్టపర్తిలో "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ వద్ద భారీగా చేరుకున్న దస్తావేజు లేఖరులు నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు ర్యాలీ గా బయలుదేరగా పోలీసులు అడ్డుకోవడంతో తిరిగి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి స్థానిక ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..... జీవో-396 అమలుతో దస్తావేజు లేఖరుల జీవనోపాధి తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న దస్తావేజు లేఖరుల జీవనోపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జీవోను రద్దు చేసి తమ వృత్తికి రక్షణ కల్పించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీవో-396ను తక్షణమే రద్దు చేయాలని, దస్తావేజు లేఖరుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు దస్తావేజు లేఖరులు, సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితుడి ఇంటి పునాది ధ్వంసం..



- బాధితుడి ఆవేదన

ధర్మవరం జులై 30, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరంలో దళితుడి ఇంటి స్థలం పునాది ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదు అని పట్టణానికి చెందిన సాకే. శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.... 2012 సంవత్సరంలో ప్రభుత్వం రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించింది అని,. అదే సంవత్సరంలో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం పునాది వేసుకున్నాను అని తెలిపారు. అయితే కుటుంబ పరిస్థితులు, ముఖ్యంగా తండ్రి అనారోగ్య సమస్యల కారణంగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయినట్లు శ్రీరాములు తెలిపారు.ఈ పరిస్థితిని అదనుగా భావించిన పక్కనే ఉన్న వెంకటేష్ (వెంకీ) అనే వ్యక్తి జేసీబీతో వచ్చి తన ఇంటి పునాదిని అక్రమంగా ధ్వంసం చేశాడని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా కులం పేరుతో దుర్భాషలాడుతూ, "నువ్వు ఎవరితో చెప్పకుంటావో చెప్పకో" అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మించిన పునాదిని ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసు శాఖ వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ , రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంకీ నుంచి తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో దౌర్జన్యాలకు పాల్పడిన వ్యక్తి మరోసారి దాడులకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొంటూ, ధర్మవరం పోలీసులు తనకు తక్షణమే రక్షణ కల్పించాలని, తన ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

# మెదడులో ఉబ్బిన రక్తనాళానికి ఆపరేషన్ లేకుండానే చికిత్స

- అత్యాధునిక 'కాయిలింగ్' విధానంతో ప్రాణాలు కాపాడిన కిమ్స్ సవీర వైద్యులు
- మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అనంతపురంలోనే అందుబాటులో సదుపాయం




అనంతపురం, జూలై 30, అనంత జనశక్తి న్యూస్

మెదడులో ఉబ్బిన రక్తనాళం (బ్రెయిన్ అన్యూరిజం) సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన ఓ రైతుకు ఎలాంటి ఓపెన్ సర్జరీ చేయకుండా అత్యాధునిక ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ విధానంలో చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ సవీర వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డా. కార్తీక్ రెడ్డి, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. పృథ్వీరాజ్ చికిత్స వివరాలను వెల్లడించారు.తాడిపత్రి ప్రాంతానికి చెందిన రామేశ్వర్ రెడ్డి వ్యవసాయదారుడు. కొద్ది రోజులుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలతో కిమ్స్ సవీర ఆస్పత్రికి వచ్చారు. సీటీ స్కాన్, మెదడు రక్తనాళాల ప్రత్యేక పరీక్షలు (సీటీ యాంజియోగ్రామ్) నిర్వహించగా, మెదడులోని ఒక రక్తనాళం ఉబ్బి ఉన్నట్లు (అన్యూరిజం) గుర్తించాం.గతంలో ఇలాంటి సమస్యలకు తలపై శస్త్రచికిత్స (ఓపెన్ బ్రెయిన్ సర్జరీ) చేయడం ప్రధాన చికిత్సగా ఉండేది. అయితే ఇప్పుడు అత్యాధునిక ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ ద్వారా ఎలాంటి పెద్ద కోత లేకుండానే చికిత్స చేశామని వివరించారు. ఈ విధానంలో తొడ భాగంలోని రక్తనాళంలో చిన్న రంధ్రం చేసి, దాని ద్వారా చాలా సన్నని గొట్టం (కాథెటర్)ను రక్తనాళాల గుండా మెదడులోని ఉబ్బిన రక్తనాళం వరకు తీసుకెళ్తారు. అనంతరం ఆ ఉబ్బిన భాగంలో ప్రత్యేకమైన సూక్ష్మ ప్లాటినం కాయిల్స్‌ను ఉంచుతారు. దీంతో ఆ భాగంలోకి రక్తప్రవాహం ఆగిపోతుంది. రక్తనాళం పగిలే ప్రమాదం తగ్గి, రోగి ప్రాణాపాయం నుంచి బయటపడతాడు. ఈ చికిత్సలో తలకు కోత ఉండదు, శస్త్రచికిత్స అవసరం ఉండదు, నొప్పి తక్కువగా ఉంటుంది. అలాగే రోగి త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి రావచ్చు. అయితే రోగికి చాలా కాలంగా అధిక రక్తపోటు (బీపీ) ఉన్నప్పటికీ క్రమం తప్పకుండా మందులు వాడడం లేదని వైద్యులు తెలిపారు. నియంత్రణలో లేని బీపీ కారణంగా మెదడులోని బలహీనమైన రక్తనాళాలు ఉబ్బిపోవచ్చు. అవి ఒక్కసారిగా పగిలితే మెదడులో తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం, మాట తడబడటం, చేతులు లేదా కాళ్లు పనిచేయకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.ఇలాంటి అత్యాధునిక ఎండోవాస్క్యులర్ కాయిలింగ్ చికిత్సలు ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉండేవని వైద్యులు తెలిపారు. ఇప్పుడు కిమ్స్ సవీరలో ఈ సదుపాయం అందుబాటులోకి రావడంతో రాయలసీమ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అనంతపురంలోనే నాణ్యమైన చికిత్స పొందే అవకాశం కలిగిందన్నారు. సకాలంలో చికిత్స అందడంతో రోగి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయినట్లు వైద్యులు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాలలో ఎదుగుదల లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి




- ఐసీడీఎస్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం
- సీడీపీఓలు, సూపర్వైజర్ కు ఛార్జ్ మెమోలు
- రక్తహీనత పిల్లల సంఖ్యను జీరో శాతానికి తీసుకురావాలి
- బాల్య వివాహాలపై ఫిర్యాదు అందితే వెంటనే చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, జూలై 30 :అనంత జనశక్తి న్యూస్

స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడీ కేంద్రాలలో ఎదుగుదల లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు.గురువారం అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనం నందు సిడిపివోలు, సూపర్వైజర్లు, తదితరులతో ఐసిడిఎస్ పై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాలలో ఎదుగుదల లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు.అనంతపురం జిల్లాలో 2,302 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, సిడిపిఓలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు పిల్లలకు పోషకాహార లోపం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎదుగుదల లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం లేదని ఐసీడీఎస్ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెలా జరిగే సమావేశానికి ఐసిడిఎస్ సిబ్బంది వారి ప్రాజెక్ట్, కేంద్రానికి సంబంధించిన కనీస సమాచారం పెట్టుకోకుండా కావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనుంచి ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేయడం జరుగుతుందని, ఇకనైనా పద్ధతి మార్చుకొని చిన్నారులకు పౌష్టికాహార లోపంపై దృష్టి సారించాలని, ఎత్తు తక్కువ, బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత పిల్లల సంఖ్యను జీరో శాతానికి తీసుకురావాలన్నారు. జిల్లాలో డ్రాప్ అవుట్ అయిన అంగన్వాడి చిన్నారులను తిరిగి కేంద్రాలలో చేర్పించాలన్నారు.ముఖ్యంగా సిడిపివోలు మరియు సూపర్వైజర్లు నిత్యం పిల్లల బరువును పర్యవేక్షించాలని, తక్కువ బరువు ఉన్న పిల్లలను ఎన్.ఆర్.సి నందు చేర్పించాలని, తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను తప్పకుండా ఎన్.ఆర్.సికి రెఫర్ చేయించాలన్నారు.

ప్రీ స్కూల్ నందు పిల్లల నమోదు తక్కువ కాకుండా చూడాలని, ఇందుకు సంబంధించి సిడిపిఓ మరియు సూపర్వైజర్లు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. గ్రోత్ మానిటరింగ్ లో తక్కువ పురోగతి ఉన్న కళ్యాణదుర్గం సూపర్వైజర్ సుధారాణి, కనేకల్ సిడిపిఓ నాగమణి మరియు ఉరవకొండ సిడిపిఓ శ్రీదేవికి చార్జి మెమోలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు.రెండు రోజులు లోపల ఐసిడిఎస్ పిడి అంగన్వాడీ సెంటర్లు తనిఖీ చేసి పిల్లల బరువులు చెక్ చేసి సంబంధిత రిపోర్టు తో పాటు చార్జ్ మెమోలు కూడా తమకు సబ్మిట్ చేయాలన్నారు.జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఖచ్చితమైన డేటాను ఎంటర్ చేయాలని, అలా కాని ఎడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సఖి, యువ గ్రూప్స్ షెడ్యూల్ ఎక్కడెక్కడ ఏ స్కూల్లో జరుపుతున్నారో అందుకు సంబంధించిన వివరాలు తమకు పంపాలన్నారు.

**బాల్య వివాహాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలి :**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి షాహిదా,డి.ఆర్.డి.ఎ పిడి శైలజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న జిల్లాలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ

- 2,58,822 మంది లబ్ధిదారులకు ₹114.65 కోట్ల పంపిణీ
- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి జూలై 30:అనంత జనశక్తి న్యూస్

ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆగస్టు 1వ తేదీన చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.మొత్తం లబ్ధిదారులు, 2,58,822 మంది,విడుదల చేసిన నిధులు ₹114.65 కోట్లు,పంపిణీ సిబ్బంది 4,831 మంది. ఆగస్టు 1న ఉదయం 6:00 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుంది.పంపిణీ చేపట్టిన మొదటి రోజునే 95% పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పింఛనుదారుల ఇంటి నుంచి పంపిణీ ప్రదేశం 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉంటే, దానికి గల స్పష్టమైన కారణాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి.పింఛన్ పంపిణీ సమయంపై గ్రామాలు, వార్డుల్లో మైకులు, టాం టాం మరియు వాట్సాప్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలి.




ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కంట్రోల్ రూమ్‌ల ద్వారా ప్రతి గంటకు పంపిణీ పురోగతిని పర్యవేక్షించాల్సి ఉంటుంది.

## విజన్ లో విద్యార్థులకు అవగాహన కల్పించిన సిఐ శ్రీనివాసులు



యాడికి, జూలై 30, అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రంలో ఉన్న విజన్ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు గురువారం సిఐ శ్రీనివాసులు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతు ప్రతి విద్యార్థి చదువు పై శ్రద్ద చూపాలని, ఇంట్లో సెల్ ఫోన్ చూడడం తగ్గించాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని,హక్కులను కాపాడుతుందని, తప్పల నుండి దూరం చేస్తుందన్నారు. మహిళలను గౌరవించాలని, గంజాయి కి దూరంగా ఉండాలన్నారు.శక్తి యాప్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మచ్చా దత్త రెడ్డి సూపర్ సెంచరీ

- 108 పరుగులు 7 ఫోర్లు 7 సిక్సర్లతో
- కడప జిల్లా జట్టుపై అద్భుత బ్యాటింగ్
- సీనియర్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్

అనంతపురం జూలై 30, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి మరోసారి అద్భుత సెంచరీ సాధించారు సీనియర్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో కడప జిల్లా జట్టుపై 108 పరుగులు ఏడు ఫోర్లు 7 సిక్సర్ల సాయంతో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సీనియర్ అంతర్ జిల్లాల సౌత్ జోన్ క్రికెట్ పోటీలుఅనంతపురం ఆర్డిటి మైదానం నందు ప్రారంభమయ్యాయి సీనియర్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి అనంతపురం కడప జట్ల మధ్య కోటి ప్రారంభమైంది టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కడప జిల్లా జట్టు 34 4 పరుగులు సాధించింది రెండో రోజు ఆటలో అనంతపురం జిల్లా జట్టు 321 పరుగులు సాధించింది అందులో అనంతపురం జిల్లా బ్యాట్స్మెన్ మచ్చ దత్తారెడ్డి 108 పరుగులు రోహిత్ రోషన్ 39 పరుగులు వీరారెడ్డి 46 పరుగులు రాజకుల్లాయప్ప 39 పరుగులు సాధించారు 321 పరుగులకు అనంతపురం జిల్లా జట్టు ఆల్ అవుట్ అయింది కడప బౌలర్లు చెన్నారెడ్డి రెండు వికెట్లు వరుణ్తేజ రెడ్డి 2 వికెట్లు విజయ్ భార్గవ్ రెండు వికెట్లు షరీఫ్ 2 వికెట్లు తీసుకున్నారు తర్వాత బ్యాటింగ్ చేసిన కడప జట్టు రెండు వికెట్లు కోల్పోయి 60 పరుగులు సాధించింది రేపు మూడవరోజు పోటీ జరుగుతుంది



## ఆర్డీవో కార్యాలయం వద్ద
# దస్తావేజు లేఖరుల ధర్నా, నిరసన

**పుట్టపర్తి రూరల్ జూలై 30 అనంత జన శక్తి న్యూస్.**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 396 జీవోకు వ్యతిరేకంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని దస్తావేజు లేఖరులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ జీవో తమ ఉపాధిని దెబ్బతీసేలా ఉందంటూ పుట్టపర్తి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

సత్యసాయి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన దస్తావేజు లేఖరులు, సహాయకులు పుట్టపర్తి గణేష్ కూడలి నుండి , ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేస్తూ ఆర్డిఓ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ ఆర్డిఓ కార్యాలయం వద్ద రెండు గంటల పాటు ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డిఓ కార్యాలయం ఏవోకు అందజేశారు .ఈ సందర్భంగా లేఖరుల సంఘం నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్ శాఖలో దస్తావేజులు రాస్తూ, లక్షలాది కుటుంబాలకు సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్న తమ పొట్ట కొట్టేలా 396 జీవో ఉందన్నారు. ఈ వివాదాస్పద జీవో వల్ల వేలాది మంది లేఖరులు, బజారున పడే అవకాశం ఉందని,వారిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయినీ వారు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గణేష్ సర్కిల్ నందు ధర్నా చేస్తూ దస్తావేజు లేఖరుల ఉపాధిని దెబ్బతీసే 396 జీవోను వెంటనే పూర్తిస్థాయిలో రద్దు చేయాలనీ,
రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో దస్తావేజు లేఖరులకు పూర్వపు హక్కులు, ప్రాధాన్యత కల్పించాలనీ,
లేఖరుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు చేపట్టాలనీ ప్రభుత్వం వెంటనే స్పందించి 396జీవోను ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది దస్తావేజు లేఖరులు వారి సహాయకులు, కంప్యూటర్ సిబ్బంది, ఎంతోమంది ఈ వృత్తిని నమ్ముకుని బ్రతుకుతున్నారని వీరందరూ నిరుద్యోగులేనని , వీరికి జీవన భృతి కోల్పోతే వారి కుటుంబాలు బజారున పడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి దస్తావేజు లేఖరుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం జీవో నెంబర్ 396 ని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంఘం నాయకులు ఎన్ శాంతమూర్తి, కే దుర్గాప్రసాద్, రామమూర్తి, బుకపట్నం మహేష్, మహేంద్ర, ధర్మవరం జావిద్, చిలుమత్తూరు మహేష్, వీరితోపాటు జిల్లా వ్యాప్తంగా దస్తావేజులేఖరులు సహాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# సాగునీటి సరఫరాలో సమర్థవంతమైన ప్రణాళికతో వెళ్ళాలి...



**- ఏలేరు కెనాల్ రెగ్యులేటర్ పరిశీలనలో రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల**

**సామర్లకోట జూలై 30:అనంత జనశక్తి న్యూస్**

సాగునీటి సరఫరా విషయంలో సమర్థవంతమైన ప్రణాళికతో అధికారులు ముందుకు వెళ్లాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సామర్లకోట ఏలేరు 2/0 కాలువ నీటి ప్రవాహాన్ని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం సాయంత్రం పరిశీలించారు. కాకినాడ జిల్లాలో రెండు రోజుల పర్యటనలో ఆయన సామర్లకోటకు విచ్చేశారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో సాగునీటి సరఫరాను ఏలేరు, పిబిసి రెగ్యులేటర్లను ఆయన పరిశీలించి కాలువల ద్వారా విడుదలవుతున్న సాగునీటి జలాల స్థాయిని తెలుసుకున్నారు. సాగునీటి విడుదల సరఫరాపై ఆయన ఇరిగేషన్ ఎస్ ఇ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎస్సీ నరసింహమూర్తి మంత్రి తో మాట్లాడుతూ
సామర్లకోట ఐదు తూముల వద్ద ఏలేరు కాలువ ఆధునీకరణ కు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గోదావరి, ఏలేరు కాలువల జలాలు ఒకే చోట నుంచి వెళుతున్నందున రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించే విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. సామర్లకోట పరిశీలనకు విచ్చేసిన మంత్రి రామానాయుడుకు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కాకినాడ జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, ఇరిగేషన్ అధికారులు పుష్పగుచ్ఛాలనందించి దుస్సాలువాళ్ళతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు సంఘం నాయకులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మంత్రి వెంట ఇరిగేషన్ ఈ ఎన్ సి నరసింహమూర్తి, ఇరిగేషన్ అడ్వైజర్ ఎం వెంకటేశ్వరరావు, సిఇ చిన్నబాబు, ఈఈ రామకృష్ణ, శేషగిరి, డిఈ ఆనంద్, కూటమి నాయకులు కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, ఏలేరు వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ వెదుళ్ళ దొరయ్య రాజశేఖర్, తెదేపా రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, రైతు నాయకులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వం లోనే వార్డుల అభివృద్ధి

**- శంకుస్థాపన కార్యక్రమం లో డిసిసిబి చైర్మన్, రంగనాగ్ లు**

**సామర్లకోట, జూలై 30 :అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వంతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ లు అన్నారు. గురువారం సామర్లకోట మున్సిపాలిటీ పరిధి 4వ వార్డు లో సుమారు రూ.21 లక్షల ఎస్సీ, ఎస్పీ నిధులతో ఆర్ సి సి డ్రైన్ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన పనులకు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల నాగ్ లు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల బాబు మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు.ఇప్పటికే పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులు చేపట్టి పలు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు.నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా తుమ్మల బాబు, రంగనాగ్ లు అన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న పశువులమ్మ అమ్మవారి ఆలయంలో వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, తాతపూడి కృష్ణ బాబు, తుమ్మల ప్రసాద్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మణి కుమారి జార్జి చక్రవర్తి, కాళ్ళ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.






## వాహనాలను తనిఖీ చేసిన,ఎస్సై,గోపాలకృష్ణ

**అమడగూరు జులై 30 ( అనంత జనశక్తి న్యూస్)**

అమడగూరు,మండల పరిధిలోని, కర్ణాటక బిల్లూరికి మరియు ఆంధ్ర చినగానిపల్లి కి కర్ణాటక,వెళ్లే రోడ్లు ప్రధాన రహదారిలో బుధవారం, అమడగూరు స్థానిక ఎస్సై గోపాలకృష్ణ,వాహనాలను తనిఖీ చేసి వాహనదారులతో మాట్లాడుతూ వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ఆర్సీలు లైసెన్సులు ఉండాలని ఎవరైనా కర్ణాటక మద్యం ఆంధ్రకు విక్రయించిన అమ్మిన, మద్యం అధికంగా, తాగి వాహనాలు నడిపిన,వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పై అధికారుల ఆదేశాల మేరకు జైలు శిక్షలు కూడా ఉంటాయని తెలియజేశారు, ఈ సందర్భంగా ఎస్సై గోపాలకృష్ణ, మాట్లాడుతూ, ఆ సాంఘిక సంఘటనలు కు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యంగా వాహనదారులు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఏ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని, వానలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు మండలంలో ఎక్కడైనా గ్యాంబ్లింగ్ లాంటివి జరగకూడదని వాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్సై వాహనదారులకు, అవగాహన సదస్సు కల్పించారు ఈ కార్యక్రమంలో ఎస్సై గోపాలకృష్ణ,పోలీస్, వాహనదారులు పాల్గొన్నారు

## సమగ్ర శిక్ష ఉద్యోగుల హెచ్చరిక..

**- సమస్యలు పరిష్కరించకపోతే 'ఛలో విజయవాడ'**

**పుట్టపర్తి రూరల్, జూలై 30 (అనంత జనశక్తి న్యూస్):**

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ సమగ్ర శిక్ష ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, పెండింగ్ జీతాల విడుదల, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 24న నిర్వహించే "ఛలో విజయవాడ" కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు.



## శివరామకృష్ణ పై దాడి చేసిన
# సిఐ పై చర్యలు తీసుకోవాలి

**పుట్టపర్తి రూరల్ జూలై 30 అనంత జన శక్తి న్యూస్.**

హిందూపురం మాతృశ్రీ ప్రైవేటు ఆసుపత్రిలో చనిపోయిన రమ్యశ్రీ అనే మహిళ వివాదంపై సీఐ రాజగోపాల్ నాయుడు, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ పై దురుసుగా ప్రవర్తించడం వ్యవహారం పై వివిధ ప్రజా సంఘాలు, దళిత, గిరిజన సంఘ నాయకులు గురువారం శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దనుండి ర్యాలీగా వెళ్లి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎస్పీ, జరిగిన విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ, సీఐ రాజగోపాల్ నాయుడు ఎలాగైనా ప్రభుత్వము పై బురద చల్లడానికి, ప్రైవేట్ ఆసుపత్రులను ప్రోత్సహించి వారితో లోపాయి కార ఒప్పందం కుదుర్చుకొని, తనపై దాడి చేశాడని తెలిపారు. దళిత బహుజన నాయకులు ఇప్పటికైనా రాజకీయ పార్టీల కు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో న్యాయం జరిగనీ పక్షంలో ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు అతీతంగా త్వరలో ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హిందూపురం, పెనుగొండ, మడకశిర ధర్మవరం, పట్టణాల నుండి బహుజన చైతన్య వేదిక నాయకులు, ప్రజా సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## ముగిసిన గురు పౌర్ణమి
# మహోత్సవ వేడుకలు..



**- అధ్యక్షులు సూర్య ప్రకాష్.**

**ధర్మవరం జులై 30, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయి నగర్ లో వెలసిన సాయిబాబా దేవాలయంలో జూలై 29వ తేదీ, 30వ తేదీలలో భక్తాదుల నడుమ గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 2 వ రోజు ఉదయం ఏకాంత పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత సాయంత్రం బాబా విగ్రహాలతో ప్రత్యేక పల్లకిలో ఆశీనులు చేసి పట్టణంలోని పురవీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ గ్రామోత్సవములో కేరళ కళాకారులు ప్రదర్శించిన నాట్యము భక్తులను, ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ఆలయ కమిటీ వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చివరి మహోత్సవ వేడుకలు రాత్రి వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ వారు తెలియజేశారు.

## సమస్యల పరిస్కారానికి
# "ఇంటింటికీ తెలుగుదేశం"



**సామర్లకోట జూలై 30: అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట పట్టణంలో 4వ రోజు "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో వార్డుల్లో సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఆరా తీసారు. సామర్లకోట పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కాకినాడ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ లు ఈ కార్యక్రమం లో పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి రెండేళ్ల కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరించారు. ఇంకా వార్డుల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. సమస్యల పరిస్కారానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా కరపత్రాలు ప్రజలకు పంచి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, అందుగుల జార్జ్ చక్రవర్తి, నిమ్మకాయల కిరణ్, బలుసు వాసు, తాతపూడి కృష్ణ బాబు, కాటమరెడ్డి అరుణ వాసవి, పిల్లాడి సత్యవతి, తాతపూడి వంశీ , వల్లూరి దొరబాబు, పిట్టా జానకి రామారావు, సరోజ వాసు, మలిరెడ్డి ప్రసాద్, గొల్తి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అందుగుల మాణికుమారి. దేవళ్ళ జయలక్షి, బొందల రామలక్ష్మీ శ్రీనివాస్, కొల్లి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మరిడమ్మ సన్నిధిలో
## డిసిసిబి చైర్మన్ కుటుంబం పూజలు



**పెద్దాపురం, జూలై 30,అనంత జనశక్తి న్యూస్**

పెద్దాపురం పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతాంగానికి సమృద్ధిగా వర్షా లు కురిసి పంటలు పుష్కలంగా పండాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, శాఖంబరి అమ్మవారు అన్నపూర్ణ స్వరూపిణిగా భక్తులను కరుణించే దైవమని, అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం నెలకొని ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలమరశెట్టి సత్తిబాబు, ఓబులిశెట్టి గున్ని, వంగలపూడి సతీష్, కఠారి శ్రీను, లక్ష్మణ్ దివాకర్ పాల్గొన్నారు.



# మలబద్ధకంతో విసిగిపోయారా, ఇప్పుడు చెప్పేవి తీసుకుంటే కడుపు మొత్తం ఖాళీ అవ్వాల్సిందే

సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి పెరగడం, పోషకాహారం తీసుకోకపోవడం, నిద్ర లేమి, నీరు ఎక్కువగా తాగకపోవడం ఇలాంటి ఎన్నో కారణాల వల్ల చాలా మందికి మలబద్ధకం సమస్య ఉంటుంది. దీనిని నేచురల్‌గా దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయని చాలా మంది జీరా వాటర్, గోరువెచ్చని నీరు తాగుతారు. అయితే, దాని బదులు, మరికొన్ని మంచి టిప్స్ ఉన్నాయని వీటిని ఫాలో అయితే ఎలాంటి మెడిసిన్ వాడకుండానే కాన్స్టిపేషన్ తగ్గుతుందని న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా చెబుతున్నారు. అలాంటి టిప్స్ ఏంటో తెలుసుకోండి.









**జీరా వాటర్ బదులు**

చాలా బదులు జీర్ణ సమస్యలు రాగానే జీరా వాటర్, వేడి నీరు తాగడం చేస్తుంటారు. అలా కాకుండా ఈ సారి కొద్దిగా గోరువెచ్చని నీటిలో నెయ్యిని కలిపి తాగి చూడండి. దీంతో మలం మృదువుగా మారుతుంది. దీంతో మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. నెయ్యి నేచురల్ లాక్సేటీవ్‌గా పనిచేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మలం మొత్తం మృదువుగా మారి మల విసర్జన సరిగా జరుగుతుంది. దీంతో బవెల్ మూమెంట్స్ సరిగా ఉంటాయి. దీనికోసం ఓ కప్పు గోరువెచ్చని నీరు లేదా పాలలో 1 టీస్పూన్ నెయ్యి వేసి కలిపి పరగడపున తాగండి. దీని వల్ల చాలా వరకూ మలబద్ధకం దూరమవుతుంది.

**ఇసబ్‌గోల్ బదులు ప్రూన్స్**

చాలా మంది ఇసబ్‌గోల్‌ని మలబద్ధకాన్ని తగ్గించేందుకు వాడతారు. అయితే, ఇది అందరికీ అందుబాటులో ఉండదు. ఉన్నా కూడా దీనికంటే మెరుగైనది తీసుకోవాలనుకుంటే ప్రూన్స్ పండ్లు తీసుకోండి. ఇవి కూడా నేచురల్ లాక్సేటీవ్ గుణాలని కలిగి ఉండి గట్ హెల్త్‌ని సరిగ్గా చేస్తాయి. ప్రూన్స్ పండ్లలో హై ఫైబర్, నేచురల్ షుగర్ ఆల్కహాల్ గుణమైన సార్బిటోల్ ఉంటుంది. దీని వల్ల స్టూల్ సాఫ్ట్ అవుతుంది. బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. రోజుకి 5 నుంచి 8 ప్రూన్స్ పండ్లు తింట నీరు ఎక్కువగా తాగండి. ఆటోమేటిగ్గా కాన్స్టిపేషన్ తగ్గుతుంది.

**బొప్పాయి**

మలబద్ధకాన్ని దూరం చేయడంలో బొప్పాయి చాలా బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. బొప్పాయి తినడం వల్ల మలబద్ధకం చాలా వరకూ తగ్గుతుంది. ఇందులోని ఫైబర్, నీటిశాతం పపైన్ అనే ఎంజైమ్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. ఇందులోని సోల్యూబుల్ ఫైబర్ స్టూల్‌ని బయటికెళ్లేలా చేస్తుంది. పపైన్ ప్రోటీన్స్‌ని బ్రేక్ చేస్తుంది. జీర్ణ వ్యవస్థని ఈజీ చేస్తుంది. దీంతో బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. అందుకోసం బాగా పండిన బొప్పాయి పండుని తీసుకోవడం మంచిది.

**పాల బదులు ఆముదం నీరు**

పాలు అందరికీ పడకపోవచ్చు. కొంతమందికి దీని వల్ల జీర్ణం లేట్‌గా అవుతుంది. అలా కాకుండా గోరువెచ్చని నీటిలో హాఫ్ టీస్పూన్ ఆముదాన్ని కలిపి నిద్రపోయేముందు తాగండి. దీంతో కొలన్ క్లెన్స్ అవుతుంది. గోరువెచ్చని నీటిలో మనం ఆముదం కలిపి తాగడం వల్ల చాలా వరకూ మలబద్ధకం తగ్గుతుంది. ఇందులోని లాక్సేటీవ్ గుణాలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. ఆముదాన్ని తీసుకోవడం వల్ల మజిల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. కడుపు మొత్తం క్లీన్ అవుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.

**వీటితో పాటు**

ఎక్కువగా ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, చిక్కుళ్లు, నట్స్, హోల్ గ్రెయిన్స్, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటివి తీసుకోవాలి.

ఎక్కువగా నీరు తాగాలి. రోజుకి కనీసం 8 నుంచి 10 కప్పుల వరకూ తీసుకోవాలి.

ప్రోబయోటిక్స్ అయిన పెరుగు, కెఫిర్ వంటివి తీసుకుంటే జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది.

ఒమేగా 3 రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. చేపలు, అవకాడో, అవిసెలు తీసుకోవాలి.

అంతేకాకుండా, రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి.

# ఆముదం, రోజ్మెరీ ఆయిల్ రెండింటిలో ఏది బెటర్, జుట్టు పెరగడానికి ఆముదం బాగా పనిచేస్తుందా,





ఆముదం, రోజ్మెరీ ఆయిల్ రెండు కూడా ముందుగా సహజమైన ఆయిల్స్. ఈ పవర్‌ఫుల్ ఆయిల్స్ రాయడం వల్ల జుట్టు కుదుళ్ళు బలంగా మారతాయి. అంతేకాకుండా, జుట్టుకి పోషణ అందుతుంది. జుట్టు రాలిపోకుండా ఉండడానికి హెల్ప్ చేస్తుంది. ఇందులో ఒక్కో నూనెలో ఒక్కో పోషకం ఉంటుంది. ఇవి జుట్టుకి సంబంధించిన సమస్యల్ని దూరం చేస్తాయి. జుట్టు చిట్లడం, డ్రై హెయిర్ వంటి సమస్యలుంటే మీరు కొబ్బరినూనె మాత్రమే కాకుండా కొబ్బరినూనెలో కొద్దిగా రోజ్మెరీ, ఆముదం కలిపి రాసి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. విడివిడిగా దేనికది ప్రత్యేకమే.. అయితే జుట్టుని కాపాడడంలో ఏది బెటర్ అంటే కొన్ని విషయాలని గమనించాలి.







**ఆముదం**

ఆముదంలో రిసినోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబయల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, స్కాల్ప్‌ని హెల్దీగా మార్చి బలమైన జుట్టుని అందిస్తాయి. ఆముదం జుట్టుకి హెల్ప్ చేస్తుంది. ఇందులో జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేసే ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఈ, ఖనిజాలు ఉంటాయి. జుట్టుకుదుళ్ళలోకి లోతుగా చొచ్చుకుపోతుంది. జుట్టుకి లోపలి నుండి పోషణని అందిస్తుంది. దీనిని రాస్తే జుట్టు పెరుగుతుంది. జుట్టు రాలకుండా ఒత్తుగా పెరుగుతుంది. దీంతో జుట్టు మెరుస్తుంది. రెగ్యులర్‌గా వాడే కొబ్బరినూనెతో కలిపి రాయడం వల్ల హెల్దీ, బలమైన జుట్టు మీ సొంతమవుతుంది.

**రోజ్మెరీ ఆయిల్**

రోజ్మెరీ ఆయిల్ రక్తప్రసరణని ప్రేరేపించి, ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తుంది. దీంతో పాటు జుట్టు రాలడానికి కారణమయ్యే హార్మోన్ DHT ని కంట్రోల్ చేస్తుంది. రోజ్మెరీ ఎసెన్షియల్ ఆయిల్‌ని రోజ్మెరీతో తయారుచేస్తారు. దీనిని శతాబ్ధాలుగా వాడుతుంటారు. దీనిని వాడడం వల్ల జుట్టు పెరుగుదలకి అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయి. దీనిలో కాల్షియం, విటమిన్ బి, ఐరన్‌లు ఉంటాయి. ఇది తలపై చర్మాన్ని క్లీన్‌గా మార్చడమే కాకుండా రక్తప్రసరణని పెంచుతుంది. జుట్టు కుదుళ్ళని ఉత్తేజపరిచి జుట్టుని మెరిసేలా చేస్తుంది.

**వాటిని కలిపితే**

ఆముదం, రోజ్‌మెరీ కలిపి మసాజ్ చేసినప్పుడు సున్నితంగా మసాజ్ చేయండి. కొన్ని గంటల పాటు చేస్తే రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు పెరుగుదలకి హెల్ప్ అవుతుంది. వారానికి, 2, 3సార్లు చేస్తే మంచి రిజల్ట్ ఉంటుంది. కాబట్టి, ఈ మధ్యకాలంలో ఎక్కువగా రోజ్మెరీ ఆయిల్ పాపులర్ అవుతుంది.

**కొబ్బరినూనెలో కలపడానికి ఏది మంచిది**

మీరు కొబ్బరినూనెతో రోజ్‌మెరీ, లేదా ఆముదాన్ని కలపాలనుకుంటే మీ అవసరాలను బట్టి వాడండి. జుట్టు పెరగాలనుకుంటే ఆముదాన్ని సెలక్ట్ చేసుకోండి. దీని వల్ల కొత్త జుట్టు పెరుగుతుంది. స్కాల్ప్ మెల్త్ మెరుగవుతుంది. ఉన్న జుట్టు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే రోజ్‌మెరీ ఆయిల్‌ని కలపండి.

**బెస్ట్ రిజల్ట్స్ కోసం**

మీరు వారానికి 1 నుంచి 2 సార్లు జుట్టుకి ఆముదాన్ని రాయండి. రెగ్యులర్‌గా రాస్తే జుట్టు జిడ్డుగా మారడమే కాకుండా చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. కాబట్టి, మితంగా వాడండి. నూనెని కొద్దిగా వేడి చేసి 15 నిమిషాల తలపై మసాజ్ చేసి మైల్డ్ షాంపూతో క్లీన్ చేయండి. వారంలో రెగ్యులర్‌గా వాడితే జుట్టు కుదుళ్ళు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ మెరుగై, జుట్టు బలంగా మారుతుంది. దీంతో జుట్టు మందంగా కూడా మారుతుంది.



# శ్రావణమాసంలో లడ్డూ విక్రయాలు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వకూడదు

**- వైయస్సార్ మండల కన్వీనర్**

**నల్లచెరువు జూలై 30, అనంత జనశక్తి న్యూస్**

నల్లచెరువు మండలం లో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భక్తులకు విక్రయించే లడ్డు ప్రసాదాలలను గత 8 ఏళ్ల క్రితమే లడ్డును 3.20 లక్షలు చెల్లించి లడ్డును విక్రాయించారని కాల క్రమేనా ఆలయానికి భక్తులు సంఖ్య పెరగడంతో ఏటా రూ.5లక్షల వరకూ ఆలయానికి ఆదాయం వచ్చేదని అయితే గత రెండు సంవత్సరాల నుండి ఆలయ అధికారులు లడ్డు ప్రసాదాల నిర్వహణ విక్రయాలను ద్వారా ఆలయానికి ఒక్కరూపాయి కూడా చెల్లించకుండా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అధి కారులు ఇవ్వడంతో ఆలయ ఆదాయానికి సుమారు. రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని ఆలయ అధికా రుల తీరు పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని భక్తులు పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదం ప్రైవేట్ వ్యక్తులు ఇష్టాను సారంగా అధిక ధరలు విక్రాయిం చి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఉన్నతాధి కారులు స్పందించి లడ్డును ప్రైవేట్ వ్యక్తులకు లబ్ది చేకూరే విధంగా కాకుండా గతంలో లాగా లడ్డు ను భక్తులకు అందజేయాలని వైఎస్సార్ సీపీ తరపున డిమాండ్ చేస్తున్నామని మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి మరియు మాజీ చైర్మన్ యనమల ఆనంద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



# ప్రమాదాన్ని కుట్రగా మార్చారు!

**శ్రీకాకుళం, జులై 30, అనంతజనశక్తి**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటనలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబానికి మద్దతుగా నిలిచారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో అప్పలరాజు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. సాధారణ రోడ్డు ప్రమాదాన్ని కుట్ర, హత్య కేసుగా చిత్రీకరించి రాజకీయ వేధింపులకు దిగుతోందని విమర్శించారు.



ఈ సంద్రాభంగా జగన్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు ఎవరూ ఉద్దేశపూర్వకంగా చేయరని, ప్రమాదాన్ని హత్యగా లేదా కుట్రగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. సీదిరి అప్పలరాజు కుమారుడు కేవలం 18 ఏళ్ల యువకుడని, ఇటీవలే నీట్ పరీక్ష రాశాడని గుర్తు చేశారు. అనుకోకుండా జరిగిన ప్రమాదాన్ని ఆధారంగా చేసుకుని అతని భవిష్యత్తును నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఎదిగిన వ్యక్తి అని జగన్ అన్నారు. పదో తరగతిలో రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంక్ సాధించి, సొంత కృషితో వైద్యుడిగా పేరు తెచ్చుకుని, అనంతరం ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగారని తెలిపారు. అలాంటి బీసీ నాయకుడిని రాజకీయంగా పూర్తిగా దెబ్బతీయాలనే ఉద్దేశంతో తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజు కుమారుడు 108కు ఫోన్ చేయడమే కాకుండా బాధితుడికి సీపీఆర్ కూడా చేశాడని జగన్ చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో కుట్ర కోణం ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. టీడీపీ నేతలు లేదా ప్రజాప్రతినిధుల వాహనాలతో ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ఇదే విధంగా కుట్ర కేసులు నమోదు చేస్తారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే వాహనం ఢీకొని వృద్ధుడు మరణించిన ఘటన, పాతపట్నం ఎమ్మెల్యేకు సంబంధించిన ప్రమాద ఘటనలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు.

రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపు పరాకాష్టకు చేరుకుందని జగన్ ఆరోపించారు. పార్థసారథిని పంపించి ర్యాలీలు నిర్వహిస్తూ కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రతి ఘటనను రాజకీయ కోణంలో చూస్తూ సమాజంలో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని అన్నారు.

బీసీల సంక్షేమంపై కూడా జగన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. యాదవులపై ప్రేమ ఉందని చెబుతున్న ప్రభుత్వం, ఆచరణలో మాత్రం బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ, చేయూత, ఆసరా వంటి పథకాలు నిలిచిపోయాయని.. బీసీలు అధికంగా నష్టపోతున్నారని అన్నారు. మూలపేట పోర్టు, ఫిషింగ్ హార్బర్లు వంటి అభివృద్ధి ప్రాజెక్టులను తమ ప్రభుత్వం తీసుకొస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని అమ్మే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు.

సీఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలు, మోసాలతోనే రాజకీయాలు చేస్తున్నారని జగన్ తీవ్ర విమర్శలు చేశారు. సీదిరి అప్పలరాజు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని, అప్పలరాజు భార్య తనకు సొంత చెల్లెలు లాంటిదని తెలిపారు.

**జగన్ ములాఖత్ నిరాకరణ**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్-అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. కాగా, సీదిరి అప్పలరాజును శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీసులు 2026 జులై 22 సాయంత్రం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో తన కుమారుడి ప్రమేయాన్ని కప్పిపుచ్చడానికి, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలతో ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చి అదుపులోకి తీసుకున్నారు.

# వైఎస్ కుటుంబంలో తీవ్ర విషాదం

**(మొదటిపేజీ తరువాయి)**

ఇప్పుడు ఆయన పెద్దనాన్న చనిపోయారు. వైఎస్ జగన్ పెదనాన్న, వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడైన వైఎస్ ఆనంద్ రెడ్డి ఇవాళ మృతి చెందారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్ ఆనంద్ రెడ్డి ఇవాళ చనిపోయారు. వైఎస్ ఆనంద్ రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే.. అక్కడే తుది శ్వాస విడిచారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి సోదరుడైన వైఎస్ కొండారెడ్డి కుమారుడే ఈ వైఎస్ ఆనంద్ రెడ్డి. ఈ క్రమంలోనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ ఆనంద్ రెడ్డి వరసకు అన్నదమ్ములు అవుతారు. ఇక వైఎస్ ఆనంద్ రెడ్డి భార్య సుశీలమ్మ గత ఏడాది కన్నుమూశారు. వైఎస్ ఆనంద్ రెడ్డికి సునీత అనే కుమార్తె ఉన్నారు. ఇక శుక్రవారం రోజున వైఎస్ ఆనంద్ రెడ్డి అంత్యక్రియలు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరగనున్నట్లు సమాచారం. అయితే ఈ అంత్యక్రియలకు వైఎస్ జగన్ హాజరు కానున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక ఈ ఏడాది మొదట్లోనే వైఎస్ జగన్ సోదరుడు వైఎస్ అభిషేక్ రెడ్డి తీవ్ర అనారోగ్యంతో చనిపోయారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీసుకున్న అభిషేక్ రెడ్డి ఈ ఏడాది జనవరి తొలి వారంలో తుదిశ్వాస విడిచారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి సోదరుడు వైఎస్ ప్రకాష్ రెడ్డి మనవడు వైఎస్ అభిషేక్‌రెడ్డి. ఇక డాక్టర్ అయిన వైఎస్ అభిషేక్ రెడ్డి.. వైద్య వృత్తిలో కొనసాగుతూనే వైఎస్సార్‌సీపీ వైద్య విభాగ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఇక పులివెందుల నియోజకవర్గం లింగాల మండల వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్‌గా కూడా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రచారంలో వైఎస్ అభిషేక్ రెడ్డి కీలకపాత్ర పోషిస్తూ.. కడప జిల్లాలో పార్టీలో కీలకంగా వ్యవహరించారు. వైఎస్ జగన్ పాదయాత్రలోనూ అభిషేక్ రెడ్డి చాలా యాక్టివ్‌గా తిరిగారు.



## భోగాపురం విమానాశ్రయం

# చుట్టూ ఆంక్షలు

**- 5 కిలోమీటర్ల మేర నో ఫ్లైయింగ్ జోన్**

**- 48 గంటల నో ఫ్లైయింగ్ జోన్**

**- ప్రధాని మోదీ పర్యటనకు భారీ భద్రత**

**అమరావతి, జులై 30, అనంత జనశక్తి న్యూస్**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భోగాపురం పర్యటన నేపథ్యంలో విజయనగరం జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు భోగాపురం విమానాశ్రయం పరిసర ప్రాంతాలను 48 గంటల పాటు నో ఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిబంధనలు జూలై 30 రాత్రి 8 గంటల నుంచి ఆగస్టు 1 రాత్రి 8 గంటల వరకు అమల్లో ఉంటాయి. విమానాశ్రయం, సభా వేదిక, హెలిప్యాడ్ చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్రత్యేక ఆంక్షలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమయంలో డ్రోన్లు, యూఏవీలు, పారా గ్లైడర్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు వంటి ఎలాంటి గగనతల పరికరాలను వినియోగించడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

బీఎన్ఎస్ఎస్2023 సెక్షన్ 163 ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన ఎలాంటి ఆటంకాలు లేకుండా సురక్షితంగా జరిగేలా ఈ చర్యలు తీసుకున్నామని చెప్పారు. భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిషేధాజ్ఞలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. కాగా, విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేయనున్నారు.. దాదాపు 2 గంటలకుపైగా మోడీ పర్యటన కొనసాగనుంది.. ఆగస్టు 1వ తేదీన అంటే శనివారం రోజు ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 1.05 వరకు భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు.. ఉదయం 10.45కి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు మోడీ.. ఇక, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు.. ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత భోగాపురం ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనానికి చేరుకోనున్నారు ప్రధాని.. భోగాపురం విమానాశ్రయాన్ని పరిశీలిస్తారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ జీపులో బహిరంగ సభ వేదికకు చేరుకోనున్నారు.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం, శిలా ఫలకం ఆవిష్కరణతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ..

# అమిత్ షా రాజీనామాకు అభిజీత్ దిప్కే డిమాండ్

**అమరావతి, జులై 30, అనంత జనశక్తి న్యూస్**



పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా జూలై 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్‌పై పోలీసులు వ్యవహరించిన తీరుపై కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే విద్యార్థులపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు.

"శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దాడులు జరగడం, రక్తం చిందించడం వెనుక అమిత్ షా ఉత్తర్వులు తప్పక ఉన్నాయి" అని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తూ హోంమంత్రి రాజీనామాను డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు తాను పూర్తి మద్దతు ఇస్తున్నానని దిప్కే తెలిపారు. సీజేపీ పార్టీకి విదేశీ నిధులు అందుతున్నాయనే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. "అమిత్ షా హోంమంత్రిగా ఉన్నప్పటికీ విదేశీ నిధులు వస్తున్నాయంటే అది ఆయన వైఫల్యమే. అలాంటప్పుడు మిమ్మల్ని ఎలాంటి 'చాణక్య' అని పిలవాలి? ఈ కోణంలో చూసినా ఆయన రాజీనామా చేయాల్సిందే" అని వ్యాఖ్యానించారు.

**పోలీసులే రాళ్లదాడి చేయించారు: సీజేపీ ఆరోపణలు**

జూలై 20న జంతర్ మంతర్ వద్ద నిరసనకారులపై దాడిని సమర్థించుకునేందుకు ఢిల్లీ పోలీసులే స్వయంగా రాళ్లదాడిని ప్లాన్ చేశారని దిప్కే సంచలన ఆరోపణ చేశారు. పోలీసులే ఒక ట్రక్కు నిండా రాళ్లను, దెబ్బతిన్న ఒక వాహనాన్ని జంతర్ మంతర్ ప్రదేశానికి తీసుకువచ్చి విద్యార్థులే హింసకు పాల్పడ్డారనే వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. బీజేపీ గూండాలు వచ్చి రాళ్లు రువ్వితే, నిందను విద్యార్థులపై మోపారని పేర్కొన్నారు. అంతేకాకుండా, బీజేపీలో చేరాలని తనను, తన కుటుంబ సభ్యులను ఆ పార్టీకి చెందిన కొందరు బెదిరించారని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారని దిప్కే ఆరోపించారు.

**బీజేపీ కౌంటర్: రాహుల్ బాటలో నడిస్తే కాంగ్రెస్‌లో చేరండి**

దిప్కే చేసిన ఆరోపణలను బీజేపీ ఖండించింది. బీజేపీ నాయకుడు కేశవ్ ఉపాధ్యాయ స్పందిస్తూ, దిప్కే నిరసనకు ముఖచిత్రంగా ఉన్నారని, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చట్టం తీసుకురావడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించిందని గుర్తుచేశారు. "ప్రభుత్వం డిమాండ్లను ఆమోదించినప్పుడు దానిని గౌరవించాలి తప్ప రాజకీయం చేయకూడదు. రాహుల్ గాంధీ బాటలో నడవాలనుకుంటే దిప్కే కాంగ్రెస్ పార్టీలోనే చేరవచ్చు" అని కేశవ్ ఉపాధ్యాయ హితవు పలికారు. దిప్కే కుటుంబాన్ని బెదిరించారనే ఆరోపణల్లో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు.

# చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఎస్పీ సతీష్ కుమార్



**- ధర్మవరం నేసేపేటలో చేనేత వ్యాపారులతో అవగాహన సదస్సు....**

**- సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ....**

**ధర్మవరం జులై 30 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని నేసేపేటలో జిల్లా ఎస్పీ ఎస్ . సతీష్ కుమార్ గురువారం పర్యటించారు. పట్టణంలోని శ్రీ శమి నారాయణస్వామి దేవస్థానంలో పట్టు చీరల తయారీ వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని సేలం ప్రాంతానికి చెందిన ఓ వస్త్ర వ్యాపారిని స్థానిక చేనేత వ్యాపారులకు పరిచయం చేశారు. అనంతరం చేనేత వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చేనేత రంగం అభివృద్ధి చెందితే ధర్మవరం ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు చీరల తయారీ వ్యాపారులు, సంఘం ప్రతినిధులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

**- ధర్మవరం పట్టు వ్యాపారవేత్త నీలూరు తిరుమల కుటుంబం...**

**- గొప్ప నిర్ణయం వైద్యుల ప్రశంసలు...**

**ధర్మవరం జులై 30 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని తోగట వీధికి చెందిన పట్టు చీరల వ్యాపారవేత్త నీలూరు తిరుమల (82) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన మరణానంతరం ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ బి.వి. సుబ్బారావు, పోలా ప్రభాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానం యొక్క ప్రాముఖ్యతను వివరించగా, వారు వెంటనే నేత్రదానానికి అంగీకరించారు. అనంతరం కంటి వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో తిరుమల నేత్రాలను సేకరించారు. ఈ నేత్రాల ద్వారా ఇద్దరు దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు వెలుగు ప్రసాదించే అవకాశం కలిగిందని వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల మానవతా దృక్పథాన్ని వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. మరణానంతరం కూడా నేత్రదానం ద్వారా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపడం గొప్ప సేవ అని కొనియాడారు.

# టిడిపి ఇంటింటా ప్రచార హోరు...



**- డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహణ**

**ధర్మవరం జులై 30, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం మండల పరిధిలోని క్లస్టర్ 7లో ఉన్న నేలకోట, నేల కోట తండా, ఏలు కుంట్ల గ్రామాల్లో డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటువారిసమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలు కుంట్ల రమణ, రమేష్ నాయుడు,బిల్వం పల్లి బాబు, రవి, ఓబులేసు, కిష్టా, నేలకోట తండా రాజా నాయక్ , కృష్ణ నాయక్ ,శివా నాయక్ వసంత నాయక్ నేలకోట నుంచి భాస్కర్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి దేవా, కోటప్ప, ఏలుకుంట్ల నుంచి రామ్మోహన్, బెస్త కిష్ట, జయశంకర్,తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేడుకల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**ఆలయ కమిటీ సభ్యులు**

**నల్లచెరువు జులై 30 అనంత జనశక్తి న్యూస్**



మండల కేంద్రమైన నల్లచెరువు వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో జిరిగిన గురుపౌర్ణమి మహోత్సవం కార్యక్రమం కి విచ్చేసిన భక్తులు కు,ధన ధాన్య వస్తురుపేనా, మరియు అన్నదానం కార్యక్రమం లో సేవ చేసిన సేవకులుకు, దేవస్థానం ప్రాంగణంలో మరియు హైవే రోడ్ లో ట్రాఫిక్ సమస్య లేకుండా భక్తులు కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సహకరించిన పోలీస్ సిబ్బందికి అధికారులు కు ఒక రూపాయి నుండి వేల రూపాయలు విరాళాలు ఇచ్చిన దాతలకు,మండల మీడియా మిత్రులకు పేరు పేరున ఆలయం కమిటీ మరియు భక్తులు తరుపున ప్రేత్యేక ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమంలో శిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు మరియు కరే రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ జోరు ఇలాగే కొనసాగనీ..!



పాన్ ఇండియా స్థాయి సినిమా చేస్తున్నారంటే చాలు... కనీసం రెండేళ్లపాటు తెరపై చూడలేమని అర్థం చేసుకోవాలి. గత కొన్నేళ్లుగా పరిశ్రమని పరిశీలిస్తే అదే విషయం స్పష్టమవుతుంది. భారీ హంగులతో రూపొందే ఆ సినిమాలు పలు కారణాలతో నత్తనడకన ముందుకు సాగుతుంటాయి. ఏడాదికి రెండు మూడు సినిమాలు చేసే కథానాయకులు సైతం ఆ ఒక్క పాన్ ఇండియా సినిమా కోసమే రెండు మూడేళ్లు కేటాయించాల్సి వస్తోంది. ఇప్పటికే ఏళ్లుగా చిత్రీకరణ చేసుకొంటున్న సినిమాలు సెట్స్‌పై చాలానే కనిపిస్తాయి. అయితే పాన్ ఇండియా సినిమాలకు పెట్టింది పేరైన ప్రభాస్ మాత్రం జోరుని ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడాదిలోనే రెండు విడుదలలతో ప్రేక్షకుల్ని పలకరిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఇప్పటికే 'ది రాజాసాబ్' ప్రేక్షకుల ముందుకు రాగా, డిసెంబరులో 'ఫౌజీ' విడుదల ఖరారైంది.

మరో పాన్ ఇండియా హీరో యశ్ కూడా ఈ ఏడాది రెండు సినిమాలతో సందడి చేస్తున్నారు. త్వరలోనే 'టాక్సిక్' విడుదల కానుండగా, దీపావళి సందర్భంగా 'రామాయణ' ప్రేక్షకుల ముందుకొస్తోంది. 'రామాయణ'లో యశ్ రావణుడిగా నటించిన సంగతి తెలిసిందే. ప్రభాస్ ఆరంభంలో ఒకొక్క సినిమా కోసం బోలెడంత సమయం కేటాయించినప్పటికీ, ఈమధ్య ప్రాజెక్టుల్ని వడివడిగా ముందుకు నడిపిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ ఒకొక్క సంవత్సరంలో రెండేసి సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చేలా ప్రణాళికలు రచించినట్టు ఆయన ప్రయాణం చాటుతోంది. అగ్ర కథానాయకుల జోరు ఇలాగే కొనసాగిందంటే అభిమానులకు అంతకుమించిన ఆనందం మరొకటి ఉండదు. పూర్తిస్థాయి ప్రణాళిక, సామర్థ్యంతో రంగంలోకి దిగితే పాన్ ఇండియా సినిమాల్ని వేగంగా చేయడం అసాధ్యమేమీ కాదంటున్నారు సినీ పరిశ్రమ పెద్దలు.

# మరో ప్రేమకథతో శార్వరీ.. వేదాంగ్!



ఇటీవలే 'మై వాపస్ ఆవుంగా' చిత్రంలో పాత తరం ప్రేమికులుగా కనిపించి సినీప్రియుల దృష్టిని ఆకర్షించారు బాలీవుడ్ హీరోయిన్ శార్వరీ వాఘ్, హీరో వేదాంగ్ రైనా. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇప్పుడిదే జోడీ మరోసారి ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఇంతియాజ్ తన తదుపరి చిత్రంలో ప్రధాన పాత్రాధారులుగా వేదాంగ్, శార్వరీలను ఖరారు చేసినట్లు సమాచారం. భావోద్వేగాలతో నిండిన ఓ ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాలని చూస్తున్నారట. ఇప్పటికే స్క్రీన్ ప్లేకి సంబంధించిన పనులు పూర్తయ్యాయని, ప్రీ ప్రొడక్షన్ పనులు చేసుకుంటున్న ఈ సినిమా చిత్రీకరణని నవంబరులో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రేమ కథలను భావోద్వేగభరితంగా తనదైన శైలిలో తెరపై ఆవిష్కరించి యువతను ఆకట్టుకునే దర్శకుడు ఇంతియాజ్.. ఈసారి ఎలాంటి మ్యాజిక్ చేయనున్నారో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం శార్వరీ.. అహాన్ పాండే సరసన అలీ అబ్బాస్ జాఫర్ రూపొందిస్తున్న సినిమాలో నటిస్తుంది.

# మమ్ముట్టి కొత్త కబురు



మలయాళ అగ్రతార మమ్ముట్టి కథానాయకుడిగా.. దర్శకుడు నితీశ్ సహదేవ్ ఓ సినిమాని తెరకెక్కించబో తు న్నట్లు గతంలో పంచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాని సెట్స్ పైకి తీసుకెళ్లినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రక టిం చిం ది నిర్మాణసంస్థ. "ఎదురుచూపులు ముగి శాయి! నితీశ్ సహదేవ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం అధికారికంగా ప్రారంభమైంది"అనే వ్యాఖ్యలతో ఈ విష యాన్ని వెల్లడిం చింది. ఇంకా పేరు ఖరారు చేయని ఈ సినిమాని 'మమ్ముట్టి కంపెనీ ప్రొడక్షన్ నం.9'(వర్కింగ్ టైటిల్)తో ప్రారంభించారు. 'తలైవార్ తంబి తలైమైయిల్' సినిమాతో ఈ మధ్యే బాక్సాఫీస్ వద్ద హిట్‌ని ఖాతాలో వేసుకున్నారు దర్శకుడు నితీశ్.

# అప్పటి వరకూ నా పుట్టినరోజు తెలీదు: ధనుష్



నాలుగో తరగతి వరకూ తనకు పుట్టినరోజు ఎప్పుడో కూడా తెలియదన్నారు కోలీవుడ్ అగ్రకథానాయకుడు ధనుష్. చెన్నైలో అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆయన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. "జులై 28 నాకు ఒక సాధారణ తేదీ మాత్రమే. చిన్నతనంలో నా ఫ్రెండ్స్ వాళ్ల పుట్టినరోజుకు కొత్తడ్రెస్‌లు వేసుకుని చాక్లెట్లు పంచుతుంటే కొత్తగా అనిపించేది. నేను నాలుగో తరగతి చదివే వరకు నా పుట్టినరోజు ఎప్పుడు వస్తుందో కూడా నాకు తెలియదు. స్కూల్లో వాళ్లను చూసి నేను కూడా అలా వేడుక చేసుకోవాలని అనుకునేవాడిని. ఇదే విషయాన్ని మా అక్కకు చెప్పాను. అప్పుడు తను నా పుట్టినరోజు జులై 28 అని చెప్పింది. మా అమ్మనాన్న మాకు కేవలం దీపావళి, సంక్రాంతికి మాత్రమే కొత్త డ్రెస్‌లు కొనేవాళ్లు. బర్త్‌డేకు కూడా కొనాలని గోల చేసి కొనిపించుకొన్నా. నా దగ్గర ఉన్న డబ్బులతో ఆశ చాక్లెట్ కొని పంచేవాడిని. స్కూల్లో చాక్లెట్స్ పంచుతుంటే ఎంతో ప్రత్యేకంగా అనిపించేది" అని ధనుష్ చెప్పారు.

# నాకు ఇష్టమైన టెస్ట్ బ్యాటింగ్ భాగస్వామివి: రహానే రిటైర్మెంట్‌పై కోహ్లీ స్పందన



టీమ్ఇండియా వెటరన్ ఆటగాడు అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రహానేకు సహచర, మాజీ ఆటగాళ్లు అభినందనలు తెలియజేస్తున్నారు. రిటైర్మెంట్ తర్వాత జీవితం సాఫీగా ముందుకు సాగాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. రహానే వీడ్కోలు పలకడంపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు.

"జింక్స్, అద్భుతమైన కెరీర్‌కు అభినందనలు మిత్రమా. నువ్వు భారత క్రికెట్‌కు అద్భుతాలు చేశావు, నీ ప్రయాణానికి నువ్వు చాలా గర్వపడవచ్చు. స్లిప్‌స్‌లో అత్యంత నమ్మకమైన ఫీల్డర్‌వి. నాకు ఇష్టమైన టెస్ట్ బ్యాటింగ్ భాగస్వామివి. నీకు ఎల్లప్పుతూ అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా. ఆ భగవంతుని ఆశీస్సులు నీకు ఉంటాయి" అని విరాట్ పేర్కొంటూ రహానే తో మైదానంలో కలిసి దిగిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో అభిమానులతో పంచుకున్నాడు. సచిన్ తెందూల్కర్, రవిశాస్త్రి, వీరేంద్ర సెహ్వాగ్, ఛెతేశ్వర్ పుజారా, కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్, రిషభ్ పంత్, పి.వి. సింధు కూడా రహానేకు అభినందనలు తెలిపారు. కోహ్లీ నాయకత్వంలో టెస్టు ఫార్మాట్‌లో రహానే మూడేళ్లకు పైగా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2018-19లో కోహ్లీ సారథ్యంలో ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలి టెస్టు సిరీస్ విజయం సాధించడంలో రహానే కీలక పాత్ర పోషించాడు. 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్ తొలి మ్యాచ్ ఓడిపోయింది. ఆ మ్యాచ్ తర్వాత కోహ్లీ వ్యక్తిగత కారణాలతో అత్యవసరంగా స్వదేశానికి వెళ్లాడు. అప్పుడు మిగిలిన మూడు మ్యాచ్‌లలో రహానే జట్టుకు నాయకత్వం వహించి భారత్‌కు చారిత్రాత్మకమైన 2-1 సిరీస్ విజయాన్ని అందించాడు.

# కామన్వెల్త్ గేమ్స్.. నీరజ్ సహా ముగ్గురు భారత అథ్లెట్లు ఫైనల్‌కు




అథ్లెట్ నీరజ్ చోప్రాతోపాటు మరో ఇద్దరు భారత అథ్లెట్లు కామన్వెల్త్ గేమ్స్ జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో 18మంది పోటీపడగా.. భారత్ నుంచి పాల్గొన్న ముగ్గురూ నీరజ్ చోప్రా (79.61 మీటర్లు), రోహిత్ యాదవ్ (78.37 మీటర్లు), యశ్ వీర్ సింగ్ (78.36 మీటర్లు) ఫైనల్‌కు క్వాలిఫై అయ్యారు. ఫైనల్ శుక్రవారం రాత్రి 10.15 గంటలకు ఫైనల్ మొదలవుతుంది.

డైరెక్ట్ క్వాలిఫికేషన్ మార్క్ (84 మీటర్లు)ను ఒక్కరూ కూడా అందుకోలేకపోయారు. గ్లాస్గోలో బలమైన గాలులతో కూడిన వాతావరణం అథ్లెట్లకు ప్రతికూలంగా మారింది. అత్యుత్తమంగా శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరగె 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. అండర్సన్ పీటర్స్ (81.29 మీ, గ్రెనెడా), డౌ స్మిత్ (80.64 మీ, సౌతాఫ్రికా), బెన్ ఈస్ట్ (80.38 మీ, ఇంగ్లాండ్) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు. నీరజ్ ఐదో స్థానంలో నిలవగా.. రోహిత్ యాదవ్ తొమ్మిదో, యశ్ వీర్ సింగ్ పదో స్థానం దక్కించుకున్నారు. పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ (78.63 మీ) ఏడో స్థానంలో నిలిచాడు.

# కాషాయం రంగులోకి జెర్సీ.. విమర్శలపై స్పందించిన హాకీ ఇండియా



మరికొద్ది రోజుల్లో పురుషుల హాకీ (Hockey) ప్రపంచ కప్ జరగనుంది. ఈ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సం యు క్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ క్రమంలోనే వరల్డ్ కప్‌నకు ముందు భారత పురుషుల, మహిళల జాతీయ జట్ల జెర్సీని నీలం నుంచి కాషాయం రంగులోకి మార్చడం వివాదాస్పదమైంది. దీనిపై విమర్శలు రావడంతో జెర్సీ రంగును ఎందుకు మార్చాల్సి వచ్చిందో హాకీ ఇండియా వివరణ ఇచ్చింది. బ్లూ సింథటిక్ మైదానంలో ఆటగాళ్లు బాగా కనిపించేందుకే జెర్సీ రంగును మార్చినట్లు స్పష్ట తని చ్చింది. "ఆటగాళ్లు, సహాయక సిబ్బందితో సమగ్రంగా చర్చిం చిన తర్వాతే జెర్సీ రంగును మార్చాం. దీని వెనుక ప్రధానమైన సాంకేతిక కారణం ఉంది. అంతర్జాతీయ హాకీ పిచ్‌లకు ప్రస్తుతం ప్రామాణికంగా ఉన్న బ్లూ సింథటిక్ ఉపరితలంతో మన ఆటగాళ్ల బ్లూ జెర్సీ కలిసిపోయినట్లుగా ఉంది. దీంతో మైదానంలో ఆటగాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కోచ్‌లు, ప్లేయర్లు పసుపు లేదా కాషాయం వంటి ప్రత్యామ్నాయ రంగులను సూచించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కాషా యం రంగును ఫైనల్ చేశాం. మన జాతీయ పతాకంలోని రంగులలో ఒకటైన కాషాయం.. ధైర్యం, త్యాగం, జాతీయ గౌరవానికి ప్రతీక. అందుకే దీన్ని ఎంచుకున్నాం. సాంకేతికంగానూ ఇది ఉత్తమంగా అనిపించింది" అని హాకీ ఇండియా పేర్కొంది. భారత హాకీ జట్టు జెర్సీ రంగులను మార్చడం కొత్తేమీ కాదని తెలిపింది. 2014 ప్రపంచ కప్ సమయంలో పసుపు రంగులోకి, 2018 వరల్డ్ కప్ వేళ స్కై బ్లూలోకి మార్చిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ ఏడాది పురుషుల హాకీ ప్రపంచ కప్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. అంతకుముందు 1971లో కాంస్యం, 1973లో రజతం దక్కాయి.

# భారత్ వస్తుందని ఆశిస్తున్నా.. బంగ్లా అత్యంత సురక్షితం: తమీమ్ ఇక్బాల్



బంగ్లాదేశ్‌లో టీమ్ఇండియా పర్యటనపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ వెళ్లాలి. కానీ, ఆ దేశంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నాడు సిరీస్ జరగలేదు. ఆ పర్యటనను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే, బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ (Tamim Iqbal) ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314